


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 185 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : ఒంగోలు | బుధవారం 11 మార్చి 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :185 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : ONGOLE | WED 11 MARCH 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## ‘ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్’గా ఏపీ

- ఏపీ టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్ ఏర్పాటుకు సన్నాహాలు
- రాబోయే పదేళ్లలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు, 40 వేల ఉద్యోగాలే టార్గెట్
- శ్రీకాకుళం, అనకాపల్లి, మచిలీపట్నంలో 3 ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదన
- రాష్ట్రంలో లభించే బీచ్ సాండ్ మినరల్స్‌పై ప్రత్యేక దృష్టి



**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్‌ను ‘ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్’గా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకు రాష్ట్ర తీరప్రాంతంలో లభించే విలువైన బీచ్ సాండ్ వంటి ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. తద్వారా రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి కొత్త ఊపునివ్వాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో గనుల శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ‘ఆంధ్రప్రదేశ్ టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్ (ఆప్స్టా-మావీవీ)’ ఏర్పాటు, పెట్టుబడుల ఆకర్షణ వంటి కీలక అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ మిషన్ ద్వారా రాబోయే పదేళ్లలో రూ. 50,000 కోట్ల పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు, 40,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం వనరులను వెలికితీయడమే కాకుండా, వాటికి విలువ జోడించడం (వాల్యూ ఎడిషన్)పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రేర్ మినరల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్రంలోని వనరులపై పూర్తి అవగాహన పెంచుకోవడంతో పాటు, భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా, రాష్ట్రంలోని తీరప్రాంతంలో లభించే బీచ్ సాండ్ మినరల్స్ దేశంలోనే అత్యంత విలువైనవని అధికారులు సీఎంకు వివరించారు. వీటిలో ప్రధానంగా ఇల్మెనైట్, రుటైల్, జిర్కాన్, మోనాజైట్, గార్నెట్, సిల్లిమనైట్ వంటి వ్యూహాత్మక ప్రాధాన్యమున్న ఖనిజాలు ఉన్నట్లు తెలిపారు. ఈ బీచ్ సాండ్ మినరల్స్ నుంచి వచ్చే ఉత్పత్తులు పెయింట్స్, కాస్మెటిక్స్, ఫార్మా రంగాలతో పాటు ఏరోస్పేస్, రక్షణ, శస్త్రచికిత్స పరికరాలు, సెరామిక్స్, ఎలక్ట్రానిక్స్, అణు ఇంధనం, అణు రియాక్టర్ల విడిభాగాల తయారీ వంటి అత్యంత కీలకమైన పరిశ్రమలకు అవసరమని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించుకునేందుకు రాష్ట్రంలో మూడు ముఖ్యమైన ప్రాసెసింగ్ పార్కులను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదించారు. శ్రీకాకుళంలో టైటానియం

మిగతా 2లో



## అది ఫేక్ ప్రచారం... వాటిని నమ్మొద్దు

- దేవాలయాల విధ్వంసంపై వైసీపీ ఫేక్ ప్రచారం చేస్తోందన్న మంత్రి లోకేశ్
- కసాపురం ఆలయ పునర్నిర్మాణ వీడియోలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫైర్
- ఆగమ సలహాదారుల ప్రకారమే పాత ఆలయాన్ని తొలగించామని వెల్లడి
- వైసీపీ పేటీయం బ్యాచ్ మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరిక

**పెన్ పవర్ డెస్క్:** వైసీపీ నాయకత్వంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో ధ్వజమె త్తారు. ఆలయాలపై దాడులు అంటూ

మిగతా 2లో



## ఇండిగో వరుస వైఫల్యాలు.. కంపెనీ సీఈవో రాజీనామా

**పెన్ పవర్ డెస్క్:** వరుస వైఫల్యాలతో విమానయాన రంగాన్ని ఓ కుదుపు కుదుపేసిన ఇండిగో సంస్థలో కీలక పరిణామం జరిగింది. తమ కంపెనీ సీఈవో పీటర్ ఎల్బర్స్ రాజీనామా చేసినట్లు యాజమాన్యం ప్రకటించింది. ఆయన రాజీనామా మంగళవారం (మార్చి 10) నుంచి అమలులోకి వస్తుందని వెల్లడించింది. సంస్థ నుంచి ఎల్బర్స్ తప్పుకోవడంతో.. ఆయన స్థానంలో రాహుల్ భాటియా బాధ్యతలు తీసుకోనున్నారు. మధ్యంతర సీఈవోగా భాటియాకు బాధ్యతలు అప్పగించినట్లు మేనేజ్మెంట్ ప్రకటించింది. తదుపరి ఏర్పాట్లు పూర్తయ్యేలోపు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ గా కొనసాగుతారని యాజమాన్యం తెలిపింది.

**ఏంటి ఇండిగో సంక్షోభం:**

నవంబర్ 1, 2025 నుంచి పూర్తిస్థాయిలో అమలులోకి వచ్చిన ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్ నిబంధనల రెండో దశ ఈ సంక్షోభానికి ప్రధాన మూలకారణం.

మిగతా 2లో

## జంట హత్యల కేసులో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డికి చుక్కెదురు



- గుండ్లపాడు జంట హత్యల కేసు
- బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసిన గురజాల కోర్టు
- కేసు తీవ్రత దృష్ట్యా బెయిల్ ఇవ్వలేమని స్పష్టం చేసిన న్యాయస్థానం
- గతేడాది జరిగిన ఈ హత్యల కేసులో ఏ-7 నిందితుడిగా ఉన్న వెంకట్రామిరెడ్డి
- కోర్టు తీర్పుతో జైలులోనే కొనసాగనున్న వైసీపీ నేత


మిగతా 2లో

## బీసీసీఐ, ఐసీసీ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన సీఎం చంద్రబాబు

- తెలుగు వైభవాన్ని ప్రపంచానికి చాటేలా అమరావతిని అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశం
- సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులతో పాటు క్రీడలు, పర్యాటక రంగాలపై ప్రత్యేక దృష్టి
- పెట్టుబడుల కోసం వచ్చే సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరపాలని సూచన
- నీరుకొండలో భారీ టూరిజం ప్రాజెక్టుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్దేశం
- సచివాలయం, పలు సంస్థలకు భూ కేటాయింపులకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదం

**పెన్ పవర్ డెస్క్:** తెలుగు జాతి వైభవాన్ని ప్రపంచానికి చాటుతూ, భావితరాలకు ఒక గొప్ప వారసత్వ సంపదగా నిలిచేలా రాజధాని అమరావతిని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాజధాని నిర్మాణంలో ఆదాయాన్ని సృష్టించే సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన 59వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. ఈ భేటీలో రాజధాని అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలపై చర్చించి, ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, రాజధాని పరిధిలోని నీరుకొండ వద్ద చేపట్టే టూరిజం ప్రాజెక్టును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు. మొత్తం 167 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టే ఈ ప్రాజెక్టులో వాటర్ ఫ్రంట్, కల్చరల్ సెంటర్, హోటళ్లు, అమ్యూజ్‌మెంట్ పార్కులు ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. పర్యాటకులను విశేషంగా ఆకర్షించేలా, తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా దీనిని అత్యంత సుందరంగా తీర్చిదిద్దాలని

మిగతా 2లో



## వంటగ్యాస్ ఆందోళన... ప్రధాని మోదీ కీలక సమీక్ష

- 10 శాతం మేర ఉత్పత్తి పెంచాలని ఇంధన ఉత్పత్తి కంపెనీలకు ఆదేశాలు
- భారత రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయన్న కేంద్రం
- దేశానికి 70 శాతం ఉత్పత్తులు ఇతర మార్గాల్లో వస్తున్నాయన్న కేంద్రం

**పెన్ పవర్ డెస్క్:** వంటగ్యాస్‌పై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వంటగ్యాస్‌ను బ్లాక్ మార్కెట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో 10 శాతం మేర ఉత్పత్తిని పెంచాలని ఇంధన

మిగతా 2లో

## ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాస...

### చొక్కాలు పట్టుకున్న కౌన్సిలర్లు



- కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం, బాహాబాహీ
- నీటి సమస్యపై చర్చించాలని బీజేపీ డిమాండ్
- కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్ల మధ్య తోపులాట
- ఛైర్‌పర్సన్ కార్యాలయం ఎదుట బైఠాయించిన బీజేపీ

మిగతా 2లో



## భారతి సిమెంట్‌కు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా జగన్ పాలన సాగించాడు


- సిమెంట్ ధర పెంచి ప్రజలపై రూ.165 కోట్ల భారం మోపారని విమర్శ
- జగన్ చేసిన అప్పులకు ఏటా రూ.71,800 కోట్లు చెల్లించాల్సి వస్తోందని వెల్లడి
- వైసీపీ ఐదేళ్ల పాలనలో చేసిన ఆర్థిక విధ్వంసానికి కాగ్ నివేదికే నిదర్శనమని వ్యాఖ్య
- కూటమి ప్రభుత్వంపై జగన్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని ధ్వజం

**పెన్ పవర్ డెస్క్:** గత ఐదేళ్ల జగన్ పాలనంతా సొంత కంపెనీలకు లబ్ధి చేకూర్చడం కోసమే సాగిందని, ముఖ్యంగా భారతి సిమెం ట్ వ్యాపారాన్ని విస్తరించడమే లక్ష్యంగా పనిచేశారని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ

మిగతా 2లో

## ఆర్థిక సంక్షోభంలో పాకిస్థాన్

### మంత్రులకు కూడా జీతాలు కట్.. ప్రధాని షరీఫ్ సంచలన నిర్ణయాలు



- పశ్చిమాసియా యుద్ధంతో పాక్ అతలాకుతలం
- అత్యంత కఠినమైన పొదుపు చర్యలను ప్రకటించిన షెహబాజ్ షరీఫ్
- వారానికి నాలుగు రోజులే పని చేయనున్న ప్రభుత్వ కార్యాలయాలు

**పెన్ పవర్ డెస్క్:** పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు, అంతర్జాతీయ మార్కె ట్‌లో ఆయిల్ ధరల పెరుగుదల పాకిస్థాన్‌ను

మిగతా 2లో

## ప్రభుత్వానికి తలవంచని ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ

### లోక్‌సభలో ప్రియాంక గాంధీ

- లోక్‌సభలో సోదరుడిని గట్టిగా సమర్థించిన ప్రియాంక గాంధీ
- నెహ్రూను విమర్శించే బీజేపీ నేతలే ఇప్పుడు ఆయన్ను ఉటంకిస్తున్నారని చురక
- స్పీకర్ ఓం బిర్లా తొలగింపు తీర్మానంపై చర్చ సందర్భంగా ఈ వ్యాఖ్యలు



**పెన్ పవర్ డెస్క్:** లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా తన సోదరుడు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని గట్టిగా సమర్థించారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి తలవంచకుండా నిలబడిన ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ అని ఆమె కొనియాడారు. మంగళవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను తొలగించాలంటూ ప్రవేశపెట్టిన తీర్మానంపై జరిగిన చర్చలో ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు. సభకు అధ్యక్షత వహిస్తున్న ప్యానెల్ స్పీకర్ కృష్ణ ప్రసాద్ తెన్నేటి అనుమతితో ప్రియాంక మాట్లాడారు. ఈ సందర్భంగా అధికార పక్షంపై ఆమె చురకలు అంటించారు. “ప్రతిరోజూ నెహ్రూజీని విమర్శించే వారే, ఈ రోజు ఆయనను ఉటంకించడం చూసి నాకు నవ్వొచ్చింది. ఒక్కసారిగా వారికి నెహ్రూజీపై గౌరవం పుట్టుకొచ్చింది. ప్రజాస్వామ్యాన్ని అత్యంత

మిగతా 2లో

# బీసీసీఐ, ఐసీసీ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన సీఎం చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి

అన్నారు.భవిష్యత్తులో క్రీడా రంగం అతిపెద్ద ఆదాయ వనరుగా మారబోతోందని చంద్రబాబు విశ్లేషించారు. ఒకప్పుడు నిధుల కోసం ఎదురుచూసిన బీసీసీఐ, ఐసీసీ వంటి క్రికెట్ బోర్డులు ఇప్పుడు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలుగా ఎలా ఎదిగాయో గమనించాలని అన్నారు. ఇదే తరహాలో ఇతర క్రీడలు కూడా వాణిజ్యపరంగా మారే అవకాశాలను అందిపుచ్చుకోవాలని, అమరావతిలో నిర్మించే స్పోర్ట్స్ సిటీ మాస్టర్ ప్లాన్ ఈ దిశగా ఉండాలని తెలిపారు.రాజధానిలో పెట్టుబడులు పెట్టేందుకు పలు ప్రముఖ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని, వారితో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ ఉండాలని చంద్రబాబు అన్నారు. "గతంలో ఉమ్మడి రాష్ట్రంలో మా ప్రభుత్వ హయాంలో సైబర్ సిటీలో పెట్టుబడులు పెట్టలేకపోయినందుకు డీఎల్ఎఫ్ వంటి సంస్థలు ఇప్పుడు బాధపడుతున్నాయి. అమరావతిలో ఆ అవకాశాన్ని వదులుకోకూడదని భావిస్తున్నాయి. ఇది మన ప్రభుత్వానికి ఉన్న విశ్వసనీయత. ఈ బ్రాండ్‌ను మరింతగా పెంచాలి" అని సూచించారు.ఓవైపు రాజధానిలో పనులను వేగవంతం చేస్తూనే, మరోవైపు పెట్టుబడిదారులను ఆకర్షించే ప్రక్రియ కొనసాగాలని స్పష్టం చేశారు. అమరావతిలో నిర్మించబోయే తెలుగు కల్చరల్ సెంటర్‌కు మంచి పేరును పరిశీలించాలని, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ కోసం ఒక పెద్ద కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**సీఆర్డీఏ అథారిటీ ఆమోదాలు**

ఈ సమావేశంలో పలు కీలక ప్రతిపాదనలకు అథారిటీ ఆమోదముద్ర వేసింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) కార్యాలయానికి 80 సెంట్ల భూమి, పరిహారంగా తుళ్లూరు ఎడ్యుకేషనల్ సొసైటీకి 3 ఎకరాలు, పంచాయితీరాజ్ పరిధిలోని ఏపీఎస్ఐఆర్డీకి 5 ఎకరాల భూమి కేటాయింపులకు ఆమోదం లభించింది.

వీటితో పాటు ఏపీ సచివాలయం, హెచ్ఓడీ టవర్ల నిర్మాణంలో మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనుల కోసం రూ.2,316 కోట్లకు, రూ.119 కోట్ల వ్యయంతో తెలుగు కల్చరల్ సెంటర్ నిర్మాణానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు.

ఈ సమావేశంలో మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, సీఆర్డీఏ, ఏడీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎడిటర్ వ్యూ

# పొగతో మసకబారుతున్న బతుకులు

అత్యధిక మరణాలకు కారణంగా నిలుస్తున్న పొగ తాగడమనే దులవాటు పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో ప్రతి ఏట మార్చి మాసం 2వ బుధవారం, అనగా 11 మార్చిన "నేషనల్ నో స్మోకింగ్ డే" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ఊపిరితిత్తులకు సంబంధించిన ప్రాణాంతక వ్యాధులు, శరీరంలో ప్రాణ వాయువు మోతాదులు తగ్గడం, బిపీ/స్ట్రోక్ లాంటి హృద్రోగాలకు దారి తీస్తున్న పొగ తాగడమనే దురలవాటు బారిన పడిన మిలియన్ల ప్రజలు మరణం అంచున తమ జీవితాలను బుగ్గిపాలు చేసుకోవడం, కుటుంబాలు ఆర్థిక సమస్యలను ఎదుర్కోవడం, కుటుంబ సభ్యులు అనాథలుగా మారడం లాంటి ప్రతికూలతలు పొగరాయుళ్లను వెంటాడుతున్నాయి. పొగ తాగడాన్ని క్రమంగా తగ్గించడంతో ఫలితంగా సత్వరమే బిపీ, ఊపిరితిత్తులు, గుండె స్పందనలు మెరుగవుతాయి. పొగ మానేస్తే శరీరంలో ప్రమాదకర కార్బన్ మోనాక్సైడ్ పరిమాణం తగ్గుతూ ఆరోగ్య పునరుద్ధరణకు బాటలు పడతాయి. పొగ తాగడమనే దురలవాటు తీవ్ర ప్రభావాలను దృష్టిలో పెట్టుకొన్న ప్రపంచ పౌర సమాజం 1984 నుంచి ప్రతి ఏట 2వ బుధవారం రోజున విశ్వవ్యాప్తంగా "నేషనల్ నో స్మోకింగ్ డే" పాటించడం కొనసాగుతున్నది. పొగను వదిలితే ఆరోగ్యం మెరుగవుతుందనే నినాదాన్ని క్రిందటి స్థాయి వరకు ప్రచారం చేయడం నేటి అవసరంగా భావించాలి. ప్రత్యక్షంగా పొగ తాగడంతో పాటు పొగరాయుళ్లతో పాటు వారు వదిలే పొగను పీల్చే సెకండ్ హాండ్ స్మోకర్స్ కూడా పొగ తాగినట్లుగా, అనారోగ్యం పాలు అవుతారని భావించాలి. పొగ తాగడం ప్రాణాంతకం కావడంతో బహిరంగ ప్రదేశాల్లో స్మోకింగ్ నిషేధం విధించబడడం సముచిత నిర్ణయంగా కొనియాడాలి. పొగ తాగడంవల్ల ఊపిరితిత్తులు, నోటి క్యాన్సర్ సంభావ్యత పెరుగుతుందని పొగరాయుళ్లు గమనించాలి. పొగ తాగడం వల్ల జీర్ణనాళం, మూత్రపిండాలు, కాలేయం, యూరినరీ బ్లాడర్ లాంటి ప్రధాన అవయవాలు కూడా దెబ్బతినడం ఖాయమని తేలింది. 2026 నేషనల్ నో స్మోకింగ్ డే ఇతివృత్తంగా "అన్‌మాస్కింగ్ ది అప్పీల్ : కౌంటరింగ్ నికోటిన్ అండ్ టొబాకో అడిక్షన్" లేదా "విజ్ఞప్తులను చేద్దాం : నికోటిన్, పొగాకు దురలవాటును వ్యతిరేకిద్దాం" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది. పొగ తాగడమనే దురలవాటు వల్ల వ్యక్తి జీవితకాలం కనీసం 10 ఏండ్లు తగ్గుతుందని తేలడం ప్రమాద హెచ్చరికగా భావించాలి. స్టైల్‌గా పొగ పీల్చడం వల్ల అనారోగ్యాలు, ఆర్థిక భారం, ఆసుపత్రి బిల్లులు, సమాజంలో చెడు పేరు, కుటుంబాల్లో చీకట్లతో పాటు చివరికి అకాల మరణం లాంటివి ఉచితంగా వస్తాయని పొగరాయుళ్లు బుద్ధి తెచ్చుకోవాలి. పొగ తాగడం వల్ల చికాకు లేదా ఇర్రిటేషన్, పొగ పట్ల తీవ్రమైన కోరిక, చంచలత్వం, నిద్రలేమి లాంటి రోగ లక్షణాలు బయట పడడం, తర్వాత తీవ్రమైన ఊపిరితిత్తులు, హృద్రోగాలు, శ్వాస క్రియ రోగాలకు దారి తీస్తుంది. "పొగకు స్వస్తి పలుకుదాం - కొత్త జీవితాలను ప్రారంభిద్దాం" అంటూ శారీరక మానసిక ఆరోగ్యాలను ఆహ్వానిస్తూ, తన కోసమే కాదు తనను నమ్మిన వారి కోసం ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకుందాం. మన ప్రాణాలు తీయక ముందే మనమే పొగకు విడాకులిద్దాం. పొగకు లొంగకుండా మన జీవితాలను సుసంపన్నం చేసుకుందాం. పొగ దురలవాటు డబ్బుతో ముడిపడింది కాదని, కుటుంబ జీవితాలతో సంబంధాన్ని పెనవేసుకుందని తెలుసుకోవాలి. పొగను వదిలితే నీ ఆరోగ్యంతో పాటు పర్యావరణ ఆరోగ్యం కూడా దెబ్బ తింటుందని మరువరాదు. తమ బతుకులు పొగసూరక ముందే బుద్ధి తెచ్చుకొని పొగకు 'నో' చెబుదాం, ఆరోగ్యకర జీవితానికి 'ఎస్' చెబుదాం.

# వంటగ్యాస్ ఆందోళన... ప్రధాని మోదీ కీలక సమీక్ష

- మొదటి పేజి తరువాయి

ఉత్పత్తి కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది. ఇంధన ఉత్పత్తిపై ఆందోళనలు రేకెత్తుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక భేటీ నిర్వహించారు.విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరితో ఉన్నతస్థాయి చర్చలు జరిపారు. ఎల్పీజీ నిల్వలు, సరఫరాపై సమీక్ష జరిపారు.కాగా ఐవోసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో కేంద్ర ప్రభుత్వం ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. కమర్షియల్ ఎల్పీజీ వాస్తవ అవసరాలను గ్యాస్ కంపెనీలు అందుకోవాల్సిందేనని ఇంధన కంపెనీలకు స్పష్టం చేసింది.ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో కొంత సంక్షోభం వాస్తవమే కానీ పెట్రోలియం ఉత్పత్తుల ప్రస్తుతానికి ఇబ్బంది లేదని కేంద్రం తెలిపింది. పశ్చిమాసియాలో యుద్ధానికి ముందు తరహాలోనే భారత రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని అన్నారు. దేశానికి వచ్చే 70 శాతం ఉత్పత్తులు హోర్ముజ్ జలసంధి నుంచి కాకుండా ఇతర మార్గాల్లో వస్తున్నట్లు కేంద్రం తెలిపింది.

# ఆర్థిక సంక్షోభంలో పాకిస్థాన్

- మొదటి పేజి తరువాయి

ఊపిరాడనీ యకుండా చేస్తున్నాయి. ముఖ్యంగా ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడుల ప్రభావంతో చమురు దిగుమతులు ప్రియమవ్వడంతో, దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రధాని షెహబాజ్ షరీఫ్ అత్యంత కఠినమైన పొదుపు చర్యలు ప్రకటించారు. గల్ఫ్ దేశాల నుంచి వచ్చే చమురు సరఫరాపైనే తమ దేశం ఆధారపడి ఉందని, ప్రస్తుత పరిస్థితుల్లో ఖర్చులను తగ్గించుకోక తప్పదని ఆయన స్పష్టం చేశారు. ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు ప్రభుత్వ కార్యాలయాలు ఇకపై వారానికి నాలుగు రోజులు (సోమవారం నుంచి గురువారం వరకు) మాత్రమే పనిచేస్తాయి. అయితే బ్యాంకులు, ఆసుపత్రులు, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు ఈ నిబంధన వర్తించదు. వచ్చే రెండు వారాల పాటు స్కూళ్లు, కాలేజీలు మూసివేస్తున్నట్లు ప్రకటించారు. ఉన్నత విద్యా సంస్థలు తరగతులను ఆన్‌లైన్‌లో నిర్వహించాల్సి ఉంటుంది. ప్రభుత్వ, అధికారిక వాహనాలకు ఇచ్చే పెట్రోల్ కోటాను 50 శాతానికి తగ్గించారు. అలాగే రాబోయే రెండు వారాల పాటు 60 శాతం ప్రభుత్వ వాహనాలను రోడ్డెక్కించబోమని ప్రధాని తెలిపారు. అంబులెన్స్‌లు, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌కు దీని నుంచి మినహాయింపు ఇచ్చారు.

మంత్రులు, సలహాదారులు రాబోయే రెండు నెలల పాటు ఎటువంటి జీతాలు తీసుకోరు. పార్లమెంటు సభ్యులందరికీ 25 శాతం, రూ. 3 లక్షల కంటే ఎక్కువ సంపాదించే ప్రభుత్వ ఉద్యోగులకు 20 శాతం

జీతాల్లో కోత విధించారు. ప్రధాని, ముఖ్యమంత్రులు, గవర్నర్లు సహా అందరు ప్రజాప్రతినిధులు, అధికారుల విదేశీ పర్యటనలపై పూర్తి నిషేధం విధించారు. కేవలం అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే అనుమతి ఉంటుంది.

# జంట హత్యల కేసులో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డికి చుక్కెదురు

పల్నాడు జిల్లా గుండ్లపాడులో సంచలనం సృష్టించిన జంట హత్యల కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ నేత పిన్నెల్లి వెంకట్రామిరెడ్డికి న్యాయస్థానంలో చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను గురజాల కోర్టు సోమవారం కొట్టివేసింది. కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకుని బెయిల్ మంజూరు చేయలేమని న్యాయమూర్తి స్పష్టం చేశారు.గతేడాది గుండ్లపాడుకు చెందిన జవిశెట్టి వెంకటేశ్వర్లు, ఆయన సోదరుడు కోటేశ్వరరావు హత్యకు గురయ్యారు. తెలంగాణలోని హుజూర్‌నగర్‌లో ఒక వివాహానికి హాజరై బైక్‌పై తిరిగి వస్తుండగా, వెల్దుర్తి మండలం బొదిలవీడు సమీపంలో వారిని వాహనంతో ఢీకొట్టి హతమార్చారు. ఈ హత్యల వెనుక పిన్నెల్లి సోదరుల ప్రమేయం ఉందని ఆరోపణలు రావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.ఈ కేసులో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఏ-7 నిందితుడిగా ఉన్నారు. ఆయన తరఫున దాఖలైన బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన గురజాల కోర్టు, కేసు పూర్వాపరాలను, గాంభీర్యాన్ని దృష్టిలో ఉంచుకొని బెయిల్‌ను తిరస్కరించింది. తాజా తీర్పుతో వెంకట్రామిరెడ్డి జైలులోనే కొనసాగనున్నారు.

# ఇండిగో వరుస వైఫల్యాలు.. కంపెనీ సీఈవో రాజీనామా

- మొదటి పేజి తరువాయి

ఈ నిబంధనలు పైలట్‌ల వారపు విశ్రాంతి సమయాన్ని 36 గంటల నుంచి 48 గంటలకు పెంచాయి. ఇది పైలట్‌ల అలసట రిస్క్‌ను తగ్గిస్తుంది. ఈ మార్పులు విమాన ప్రయాణాల భద్రతను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మెరుగుపరచాలని లక్ష్యంగా చేసిన ప్రయత్నం. ఈ నిబంధనల గురించి రెండు సంవత్సరాల ముందు నుంచే పూర్తి అవగాహన ఉన్నప్పటికీ, కొత్త నిబంధనలకు అనుగుణంగా తగినంత మంది సిబ్బందిని సమకూర్చుకోవడంతోపాటు రోస్టరింగ్ వ్యవస్థను మెరుగుపరచడంలో ఇండిగో నిర్లక్ష్యం వహించింది. భారతదేశంలో అత్యధిక విమానాలను నడుపుతున్న సంస్థగా, సిబ్బంది కొరతను సరిచేయడానికి ఇండిగో ప్రణాళికా లోపం సంస్థ కార్యకలాపాలను ఒక్కసారిగా కుప్పకూల్చింది.

**డీజీసీఏ వైఫల్యం**

దేశ పౌర విమానయాన భద్రతకు అత్యున్నత బాధ్యత వహించే డీజీసీఏ చర్యలు ఈ సంక్షోభంలో అసమర్థతను చూపించిందని నిపుణులు విమర్శిస్తున్నారు. డీజీసీఏ, ఇండిగోకు షోకాజ్ నోటీసు ఇవ్వడం న్యాయపరమైన చర్య అయినప్పటికీ, వేలాది విమానాలు రద్దై, ప్రయాణీకులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయిన తర్వాత మాత్రమే డీజీసీఏ స్పందించింది. ఎయిర్‌క్రాఫ్ట్ రూల్స్1937 ప్రకారం డీజీసీఏ సంస్థకు విమానయాన ఆపరేటర్‌పై భారీ జరిమానాలు విధించే అధికారం లేదా ఎయిర్ ఆపరేటర్స్ పర్మిట్ రద్దు చేసే అధికారం ఉంది. ఈ జాప్యం డీజీసీఏ వ్యవస్థాపరమైన పర్యవేక్షణ వైఫల్యాన్ని తెలియజేస్తుంది. ముందస్తు తనిఖీ చేయడంలో విఫలమవడం, డీజీసీఏ తన ప్రాథమిక భద్రతా విధులను పూర్తిగా నిర్లక్ష్యం చేసినట్టేనని విమర్శలు వచ్చాయి.

**ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం**

దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో చట్టపరమైన బాధ్యతతో పాటు నైతిక బాధ్యత వహించాలి. నిబంధనల అమలుకు తగిన ఏర్పాట్లు చేయడంలో విఫలమవడం అనేది కేవలం నిర్వహణ లోపం కాదు. ఇది 'ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం'గా పరిగణించవచ్చు. ఎందుకంటే, తమ అధిక లాభాలను కాపాడుకోవడానికి, ఇండిగో భద్రతా నిబంధనల అమలును ఆలస్యం చేసిందని, తద్వారా సంస్థ విమానయాన చట్టాలను ఉల్లంఘించిందని స్పష్టం చేస్తోంది. న్యాయ పదజాలంలో 'రెస్ ఇప్సా లోక్విటూర్' అనే సూత్రం ఇక్కడ వర్తిస్తుంది. అంటే, నష్టం జరగడానికి సంస్థ నిర్లక్ష్యమే కారణమని స్పష్టంగా తెలుస్తోంది. ఈ నిబంధనల ఉల్లంఘన విమానయాన చట్టాల క్రింద ఇండిగో విశ్వసనీయతను తీవ్రంగా దెబ్బతీసింది. డీజీసీఏ సీఏఆర్? (పౌర విమానయాన అవసరాలు) సెక్షన్ 3, సిరీస్ ఎం, పార్ట్ ×ు అనేది విమాన ప్రయాణానికి నిరాకరించినప్పుడు, విమానాలు రద్దు అయినప్పుడు, ఆలస్యం అయినప్పుడు ప్రయాణీకులకు విమానయాన సంస్థలు అందించవలసిన సౌకర్యాలు, పరిహారం గురించిన నియమావళి ప్రకారం అందించాల్సిన నష్టపరిహారం, రిఫండ్‌లతో పాటు ఇతర సౌకర్యాలను సకాలంలో అందించడంలో కూడా ఇండిగో వైఫల్యం చెందింది. ఈ వైఫల్యం కారణంగా ఇండిగో కన్స్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్ 2019 కింద 'సేవా లోపం'కు పూర్తి బాధ్యత వహించాలి.

# ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాస...

ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం రసాభాసగా మారింది. కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం జరిగింది. రెండు పార్టీల కౌన్సిలర్లు పరస్పరం చొక్కాలు పట్టుకుని, బాహాబాహీకి దిగారు. ఇరు పార్టీల గందరగోళం మధ్యనే ఛైర్‌పర్సన్ అనూష 'అజెండా పాస్' అంటూ ప్రకటన చేసి తన ఛాంబర్‌లోకి వెళ్లిపోయారు. అయితే చర్చ లేకుండానే అజెండాను ఎలా పాస్ చేస్తారని బీజేపీ కౌన్సిలర్లు ఛైర్‌పర్సన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఛైర్‌పర్సన్ ఛాంబర్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఛైర్‌పర్సన్, కాంగ్రెస్ కౌన్సిలర్లు బయటకు రాకుండా బీజేపీ కౌన్సిలర్లు అడ్డుకున్నారు. పోలీసులు జోక్యంతో ఛైర్‌పర్సన్ బయటకు వచ్చారు. దీంతో దాదాపు మూడు గంటల పాటు అక్కడ ఉద్రిక్తత నెలకొంది. కాగా, నీటి సమస్యపై చర్చించాలని బీజేపీ కౌన్సిలర్లు డిమాండ్ చేయడం ఉద్రిక్తతకు దారి తీసింది. కాంగ్రెస్ కౌన్సిలర్ అజయ్, బీజేపీ కౌన్సిలర్ రాకేష్ మధ్య తోపులాట చోటు చేసుకుంది. పాలకవర్గం సభను నామమాత్రంగా నిర్వహిస్తున్నారని బీజేపీ కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు.

# అది ఫేక్ ప్రచారం... వాటిని నమ్మొద్దు

- మొదటి పేజి తరువాయి

అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ ను సోషల్ మీడియాలో పంచుకున్నారు. రాష్ట్రంలో హిందూ దేవాలయాల విధ్వంసం జరుగుతున్నట్లు వైసీపీ ఫేక్ ముఠా ప్రచారం చేస్తోంది... ఇందులో ఎలాంటి వాస్తవం లేదు... వీటిని నమ్మొద్దు... ప్రజల మధ్య కులం, మతం, ప్రాంతం పేరుతో అలజడి రేపేందుకు యత్నిస్తున్నారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు."అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం కసాపురంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయ పునర్నిర్మాణం సందర్భంగా తీసిన వీడియోలతో ఫేక్ ప్రచారం చేస్తున్నారు. దేవాలయ గర్భాలయం, విమానగోపురం, అర్ధ మండపం రాతి నిర్మాణపు పనులు 60 శాతం పూర్తయ్యాయి. దేవస్థానం వైదిక కమిటీ సభ్యుల తీర్మానం ప్రకారం, ఆగమ సలహాదారుల సూచనల మేరకు ఫిబ్రవరి 28న శాస్త్రోక్తంగా పాత ఆలయాన్ని తొలగించారు. ఫేక్ ప్రచారం చేస్తున్న వైసీపీ పేటియం బ్యాచ్ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రజలు నిజానిజాలు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను" అంటూ నారా లోకేశ్ ట్వీట్ చేశారు.

# భారతి సిమెంట్‌కు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా జగన్ పాలన సాగించాడు

- మొదటి పేజి తరువాయి

మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రస్థాయిలో విమర్శించారు. సిమెంట్ ధరను కృత్రిమంగా పెంచి ప్రజాధనాన్ని తన కంపెనీకి మళ్లించారని, అదే సమయంలో తన మీడియా సంస్థ అయిన సాక్షికి వందల కోట్ల రూపాయల ప్రకటనలు ఇచ్చుకున్నారని ఆరోపించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

**భారతి సిమెంట్‌కు రూ.165 కోట్ల లబ్ధి**

జగన్ తన అధికారాన్ని పూర్తిగా దుర్వినియోగం చేశారని పార్థసారథి ధ్వజమెత్తారు. "రాష్ట్రానికి ఆదాయం తెచ్చే మార్గాలను గాలికొదిలేసిన జగన్, తన కంపెనీల ఆదాయానికి మాత్రం ఎలాంటి లోటు రాకుండా చూసుకున్నారు. భారతి సిమెంట్‌కు లబ్ధి చేకూర్చేందుకు సిమెంట్ బస్తాపై రూ.3 పెంచి, ప్రజలపై ఏకంగా రూ.165 కోట్ల భారం మోపారు. ఈ నిర్ణయంతో భారతి సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం మూడు రెట్లు పెరిగింది. మరోవైపు, సాక్షి పత్రికకు ప్రకటనల రూపంలో రూ.400 కోట్లకు పైగా కట్టబెట్టారు. ప్రత్యేక జీవోలు జారీ చేసి వాలంటీర్లు, సచివాలయ సిబ్బందితో బలవంతంగా సాక్షి పత్రికను కొనిపించారు. దీన్నిబట్టి ఆయన పాలన ఎవరి కోసం సాగిందో స్పష్టమవుతోంది" అని పార్థసారథి విమర్శించారు.

**ఆర్థిక విధ్వంసానికి కాగ్ నివేదికే సాక్ష్యం**

జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని, ఆయన సృష్టించిన ఆర్థిక విధ్వంసానికి కాగ్ నివేదికే సాక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో రాష్ట్రం మొత్తం రూ.9.70 లక్షల కోట్ల అప్పు చేసిందని, ఈ అప్పులకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏటా రూ.71,800 కోట్లు అసలు, వడ్డీల రూపంలో చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

"ఇప్పుడు అసెంబ్లీకి రాకుండా ఇంట్లో కూర్చుని, కూటమి ప్రభుత్వంపై జగన్ అసత్య ప్రచారాలు చేస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రూ.87 వేల కోట్లు అప్పు చేసిందని దుష్ప్రచారం చేస్తున్నారు. కానీ కాగ్ నివేదిక ప్రకారం ఆ ఏడాదిలో మొత్తం అప్పు రూ.81 వేల కోట్లు. అందులో తొలి మూడు నెలలు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వమే రూ.27,025 కోట్లు అప్పు చేసింది. ఆ తర్వాత తొమ్మిది నెలల్లో కూటమి ప్రభుత్వం రూ.53 వేల కోట్లు మాత్రమే అప్పు చేసింది. జగన్ చేసిన అప్పులతో ఆస్తులు సృష్టించలేదు, కానీ మేం మూలధన వ్యయం కింద రూ.16 వేల కోట్లు ఖర్చుచేసి భవిష్యత్ తరాలకు ఆస్తులను అందిస్తున్నాం" అని పార్థసారథి వివరించారు.

**సంక్షేమం, అభివృద్ధిలో ముందున్నాం**

ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, సంక్షేమ పథకాల అమలులో రాజీ పడటం లేదని మంత్రి తెలిపారు. "జగన్ హయాంలో ఐదేళ్లలో అమ్మ ఒడికి రూ.26 వేల కోట్లు ఖర్చు చేస్తే, మా ప్రభుత్వం ఐదేళ్లలో రూ.35 వేల కోట్లు ఖర్చు చేయనుంది. సామాజిక పింఛన్లకు జగన్ రూ.58,500 కోట్లు ఖర్చు చేస్తే, మేం కేవలం 20 నెలల్లోనే రూ.58,654 కోట్లు చెల్లించాం. చంద్రబాబు నాయకత్వంపై నమ్మకంతో రాష్ట్రంలో మళ్లీ విశ్వసనీయత పెరిగింది. జగన్ పాలనలో వెళ్లిపోయిన కంపెనీలు తిరిగి పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నాయి. ఇప్పటికే 20 పారిశ్రామిక పాలసీలు తీసుకొచ్చి, 20 నెలల్లో రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం. తద్వారా 6.50 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాం. ఇచ్చిన హామీ ప్రకారం 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే మా లక్ష్యం" అని ఆయన పేర్కొన్నారు.అన్నం పెట్టే రైతులను సైతం జగన్ మోసం చేశారని, ధాన్యం కొనుగోలు బకాయిలు రూ.1600 కోట్లు చెల్లించకుండా వెళ్ళిపోయారని పార్థసారథి మండిపడ్డారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తోందని తెలిపారు. పోలవరం, అమరావతి వంటి కీలక ప్రాజెక్టులను నాశనం చేసి, కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులను పక్కదారి పట్టించి రాష్ట్రాన్ని ఐదేళ్లు వెనక్కి నెట్టిన జగన్, ఇప్పుడు ప్రజలను మభ్యపెట్టాలని చూడటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు.

# ప్రభుత్వానికి తలవంచని ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ

- మొదటి పేజి తరువాయి

బలోపేతం చేసింది నెహ్రూజీనే అని ఇప్పుడు చెబుతున్నారు" అని ప్రియాంక వ్యాఖ్యానించగా, ప్రతిపక్ష సభ్యులు బల్లలు చరుస్తూ మద్దతు తెలిపారు. అనంతరం రాహుల్ గాంధీని సమర్థిస్తూ, "గత 12 ఏళ్లుగా ఈ ప్రభుత్వం ముందు తలవంచని వ్యక్తి ఈ దేశంలో ఒక్కరే ఉన్నారు. ఆయనే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ. ఎందుకంటే లోక్‌సభ నాయకుడు నిజం మాట్లాడటానికి వెనుకాడరు. కానీ, వారు (ప్రభుత్వం) నిజాన్ని జీర్ణించుకోలేరు" అని ప్రియాంక అన్నారు.అంతకుముందు, స్పీకర్‌కు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన తీర్మానంపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు స్పందించారు. రాజ్యాంగం ప్రకారం చట్టాలు, నిబంధనలకు అధికార, ప్రతిపక్ష సభ్యులందరూ కట్టుబడి ఉండాలని అన్నారు. "ఏ వ్యక్తి అయినా తనను తాను అన్నింటికీ అతీతుడిగా భావించినప్పుడు, అతడిని నిలదీయడం చాలా ముఖ్యం" అని రాహుల్ గాంధీని ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు.

# 'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్'గా ఏపీ

- మొదటి పేజి తరువాయి

పార్క్ (ఏడాదికి 15 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం), అనకాపల్లిలో రేర్ ఎర్త్ కారిడార్ (ఏడాదికి 25,000 టన్నుల ఉత్పత్తి లక్ష్యం), మచిలీపట్నంలో సమగ్ర టైటానియం, రేర్ ఎర్త్ కారిడార్‌లను ఏర్పాటు చేయాలని తమ ప్రతిపాదనలను సీఎం ముందుంచారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, గనులు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఇంటూరి చొరవతో మొదలైన రాకపోకలు

## చుట్టుగుంట వద్ద కల్వర్టుకు తాత్కాలిక రిపేర్లు




**కందుకూరు పెన్ పవర్, మార్చి 10:**

కందుకూరు నుంచి చుట్టుగుంట వెళ్లే రోడ్డులో పల్లెవాగుపై పురాతన కల్వర్టు సోమవారం రాత్రి కుంగిపోయింది. 35 సంవత్సరాల క్రితం నిర్మించిన కల్వర్టు పైపులు పగిలిపోయి గుంత ఏర్పడింది. దీంతో కందుకూరు నుంచి చుట్టుగుంట మీదుగా ఉలవపాడుకు రాకపోకలు నిలిచిపోయాయి. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు రాకపోకలు కొనసాగే విధంగా, కల్వర్టుకు ఏర్పడ్డ గుంత పూడ్చాలని మున్సిపల్ కమిషనర్ అనూష ను ఆదేశించారు. దీంతో అధికారులు మట్టితో తాత్కాలికంగా మరమ్మత్తులు చేశారు. కల్వర్టును పూర్తిగా మట్టితో పూడ్చడంతో రాకపోకలు మళ్లీ మొదలయ్యాయి. ఎమ్మెల్యే స్పందించిన తీరు పట్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, ప్రయాణికులు హర్షం వ్యక్తంచేశారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

## ప్రయాణికుల భద్రత కోసం

# ఆటోలకు డిజిటల్ స్టిక్కర్లు

### - జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు

### - ఆటోలకు డిజిటలైజేషన్ నెంబర్ స్టిక్కర్లు ఆవిష్కరించిన ఎస్పీ




**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి10**

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఆటోలకు పోలీస్ డిజిటలైజేషన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ డిజిటల్ నెంబర్ల స్టిక్కర్లను ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు, మంగళవారం జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆవిష్కరించారు. ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా ఆటో ప్రయాణికులకు, తాము ప్రయాణిస్తున్న ఆటోలకి సంబంధించిన పూర్తి వివరాలను అందుబాటులో ఉంచడంతో పాటు, వారు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరడానికి భరోసా కల్పించడమే ఈ డిజిటల్ నెంబర్ల కేటాయింపు యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమంలో భాగంగా ఒంగోలు పట్టణంలో నడిచే ఆటోలకు ప్రత్యేకంగా డిజిటలైజేషన్‌లో నంబర్ కలిగిన స్టిక్కర్లు అమర్చే ప్రక్రియను ప్రారంభించారు. ఈ విధానం ద్వారా ఆటోలను సులభంగా గుర్తించడం, ట్రాఫిక్ నియంత్రణను మెరుగుపరచడం, అలాగే ప్రజలకు మరింత భద్రత కల్పించడం లక్ష్యంగా పోలీసు శాఖ వినూత్నంగా చర్యలు చేపట్టింది. డిజిటలైజేషన్ నెంబర్ స్టిక్కర్ల ద్వారా ప్రతి ఆటోకు ప్రత్యేక గుర్తింపు ఉండడంతో అవసరమైన సందర్భాల్లో పోలీసులు వేగంగా సమాచారాన్ని గుర్తించే అవకాశం ఉంటుంది. ప్రయాణికులు కూడా ఆటో వివరాలను సులభంగా గుర్తించగలిగే విధంగా ఉపయోగపడుతుందన్నారు. ఇది చట్టవిరుద్ధ కార్యకలాపాలను నియంత్రించడంలో కూడా ఉపయోగపడుతుందని తెలిపారు. ఇందులో డ్రైవర్ కు సంబదించి పూర్తి వివరములతో ఏ4 సైజ్ డిస్ప్లే బోర్డు క్యూఆర్ కోడ్‌తో కూడిన 2 స్టిక్కర్స్ ను ఇవ్వడం జరుగుతుంది. డ్రైవర్స్ మరియు ఓనర్స్ ఇద్దరికి షుషు.ుశీఖుఎయిటవయిశీబతీఅవవ.ఎశీఎ 6 షవఎంఔవ సంబధించిన పూర్తి సమాచారం ఏ4 ంఅఓవ డిస్ప్లే కార్డు,క్యూఆర్ కోడ్ తో కూడిన 2 స్టిక్కర్స్ ను ఇవ్వడం జరుగుతుంది. ప్రయాణికులు ప్రయాణించు సమయమున ఆటో లో డ్రైవరు సంబధించిన పూర్తి సమాచారం తో కూడిన క్యూఆర్ కోడ్ ఉంటుంది.

ప్రయాణికులు ఆటో ఎక్కిన తరువాత మీయొక్క భద్రత దృష్ట్యా క్యూఆర్ కోడ్ ను స్కాన్, ఫోటో తీసుకున్న యెడల ఆటో డ్రైవర్, ఓనర్ ల యొక్క పూర్తి వివరాలు ఈ క్రింద విధముగా కనపడును. ఇది క్యూఆర్ కోడ్ గూగుల్ లెన్స్ ద్వారా స్కాన్ ద్వారా పని చేస్తుందని జిల్లా ఎస్పి వి. హర్షవర్ధన్ రాజు అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మీడియా తో మాట్లాడుతూ... క్యూ ఆర్ కోడ్ గూగుల్ లెన్స్ ద్వారా స్కాన్ చేసిన తరువాత ఆప్షన్స్ వస్తాయన్నారు.

**ప్రింట్:** ఆటో డ్రైవర్, ఓనర్ గురించి పూర్తి విరాలు ప్రింట్ తీసుకోవచ్చు

**షేర్ ఆన్ వాట్సాప్:** ఆటోలో ప్రయాణించు ప్రయాణికులు తమ కుటుంబ సభ్యులకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా ఏ వాహనంలో ప్రయాణిస్తున్నామో వాట్సాప్ ద్వారా షేర్ చేయవచ్చు ట్రాక్ లొకేషన్ ప్రయాణికులు ఒక చోట నుండి వారు వెళ్ళే గమ్యస్థానంకు సంబంధించిన లొకేషన్ అత్యవసర సమయమున మాత్రమే ట్రాక్ లొకేషన్ ఎంచుకున్న యెడల పోలీస్ కంట్రోల్ రూమ్ కు అనుసంధానం చేయడం వలన పోలీస్ కంట్రోల్ రూమ్ కు సమాచారం చేరుతుంది.

**రేట్ ఫర్ డ్రైవర్..:** ఆటో డ్రైవర్ యొక్క ప్రవర్తన తీరు పై మీ యొక్క అభిప్రాయం ను రేటింగ్ ద్వారా తెలపవచ్చు. కంప్లైంట్ ఆటో లో మీరు ప్రయాణిస్తున్నప్పుడు మీ యొక్క వస్తువులు మరిచిపోయిన యెడల, ఆటో డ్రైవర్ ఏదైనా ఇబ్బంది పెట్టిన యెడల పోలీస్ కంట్రోల్ రూమ్ కు కంప్లైంట్ చేయవచ్చన్నారు.

**ఎమర్జెన్సీ కాల్ ..:** మీరు ప్రయాణించు అత్యవసర సమయములో 112 కు కాల్ చేయవచ్చు. నియరెస్ట్ పోలీస్ స్టేషన్ మీరు ప్రయాణిస్తున్నప్పుడు మీకు అత్యంత దగ్గర ఉన్న పోలీస్ స్టేషన్ యొక్క పోలీస్ ఆఫీసర్స్ యొక్క ఫోన్ నెంబర్స్ డిస్ప్లే అవుతుంది. అత్యవసర సమయమున మీరు ఆ నెంబర్స్ కు కాల్ చేయవచ్చును. డిజిటల్ నెంబర్స్ తీసుకోవాలంటే ఆటో ఓనర్, డ్రైవర్లు తమ వాహనం యొక్క పూర్తి వివరాలతో పాటు తమ ఆధార్ కార్డులను, డ్రైవింగ్ లైసెన్స్ ను, పాస్ పోర్ట్ సైజు ఫోటోలను ట్రాఫిక్ పోలీసు వారికి అందించవలసి ఉంటుంది. ఆ వివరాలను పోలీసు వారు తమ వద్ద ఉన్న ప్రత్యేకమైన వెబ్ సైట్ లో పొందుపరిచి, ఆ వివరాలతో కూడిన ఒక క్యూఆర్ కోడ్ ను రూపొందించి ప్రత్యేకమైన డిజిటల్ నెంబర్ కలిగిన స్టిక్కర్ ను ఆటోల డ్రైవర్లు/ఓనర్లలకు అందించడం జరుగుతుంది. కావున , ఒంగోలు జిల్లా వ్యాప్తంగా ఆటో డ్రైవర్లు, యజమానులు పోలీస్ వారికి సహకరించి, తమ వివరాలను అందించి డిజిటల్ నెంబర్లు పొందాలి. ఇలా చేయడం ద్వారా నేర నియంత్రణ మరియు ట్రాఫిక్ నియంత్రణతో పాటు ప్రజల సౌకర్యాల నిమిత్తం, ప్రయాణికుల భద్రత కొరకు పోలీసు వారు తీసుకొన్న నిర్ణయాలకు మీ సహకారాన్ని అందించాలన్నారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ స్టిక్కర్లను ఏర్పాటు చేస్తున్నామని, ఆటో డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ముఖ్యంగా మహిళలు, వృద్ధుల పట్ల గౌరవంతో ప్రవర్తించాలని సూచించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపరాదని, లైసెన్స్ కలిగిన వ్యక్తులు మాత్రమే ఆటోలు నడపాలని, డ్రైవర్ సీటు పక్కన అనవసరంగా వ్యక్తులను కూర్చోబెట్టకూడదని కూడా సూచించారు. ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేయరాదన్నారు.

**ఆటో డ్రైవర్ లను అభినందించిన ప్రకాశం జిల్లా ఎస్పీ**

ఇటీవల ఒంగోలు కోర్ట్ సెంటర్ వద్ద ఆటో ఎక్కి ప్రయాణించి దిగేటప్పుడు తన విలువైన బ్యాగును మర్చిపోయి వెళ్లారు. ఆ ఆటోను నడిపిన ఒంగోలు బాలాజీ నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ గద్దె నాగేశ్వరరావు ఆ బ్యాగును గుర్తించి వెంటనే ఒంగోలు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఆ బ్యాగులో సుమారు రూ.30 లక్షల విలువ గల బంగారం నగదు ఉన్నాయి. అలాగే ఒంగోలు బిలాల్ నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ షేక్ ఖలీల్ వెంకటేశ్వర కాలనీ నుండి ప్రయాణికులను ఎక్కించుకుని ఒంగోలు రిమ్స్ హాస్పిటల్ వరకు వారిని దించారు. ప్రయాణికులు దిగిన తర్వాత ఆటో వెనుక భాగంలో ఉన్న బ్యాగును మర్చిపోయి వెళ్లారు. దానిని గుర్తించిన ఆటో డ్రైవర్ షేక్ ఖలీల్ వెంటనే ఆ బ్యాగును ఒంగోలు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు అప్పగించారు. ఆ బ్యాగులో సుమారు 6 సవర్ల బంగారం, వెండి, నగదు ఉన్నాయి. బంగారు ఆభరణాలు, నగదుతో దొరికిన బ్యాగ్ ను ఎంతో నిజాయితీగా పోలీసులకు అప్పగించి తన ఔనత్యం చాటుకున్న ఆటో డ్రైవర్ లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డిఎస్పీ రాయపాటి. శ్రీనివాసరావు, ఎఆర్.డీఎస్పీ కె.శ్రీనివాసరావు, ఒంగోలు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ జగదీష్, ఒంగోలు వన్ టౌన్ సీఐ నాగరాజు, ఒంగోలు టు టౌన్ సీఐ శ్రీనివాసరావు, ఆర్ఐ రమణారెడ్డి, ట్రాఫిక్ ఎస్సై కోటయ్య,శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏప్రిల్ 16 కల్లా విద్యార్థులందరికీ

# ఉచిత సైకిళ్లు

### కొరిశపాడు మండలంలో అభివృద్ధి పనులకు మంత్రి గొట్టిపాటి శ్రీకారం





**అద్దంకి(ఆర్సి ఇంచార్జ్)**
**పెన్ పవర్, మార్చి 10**

అద్దంకి నియోజకవర్గంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమం రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి. రవికుమార్ ఆధ్వర్యంలో నిర్విరామంగా కొనసాగుతోంది. మంగళవారం కొరిశపాడు మండలంలోని పమిడిపాడు, దైవాలరావూరు ఉన్నత పాఠశాలలకు చెందిన 271 మంది విద్యార్థులకు మంత్రి ఉచితంగా సైకిళ్లు అందజేశారు. వచ్చే నెల 16 నాటికి నియోజకవర్గంలోని అర్హులైన విద్యార్థులందరికీ సైకిళ్ల పంపిణీ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

**ప్రహరీ గోడకు శంకుస్థాపన.. కొనుగోలు కేంద్రం ప్రారంభం**

పమిడిపాడు పాఠశాలలో రూ.15 లక్షలతో నిర్మించనున్న ప్రహరీ గోడకు మంత్రి లాంఛనంగా శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రభుత్వ మార్కెటింగ్ సంస్థ ఆధ్వర్యంలో రైతుల కోసం ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని, భగీరథ రసాయన పరిశ్రమల సౌజన్యంతో ఏర్పాటు చేసిన రక్షిత తాగునీటి పథకాన్ని ప్రారంభించారు. ఇదే గ్రామంలో 16 మంది చిరువ్యాపారులకు తోపుడు బళ్లను పంపిణీ చేశారు. పమిడిపాడులో సుమారు రూ.3 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి వివరించారు. దాతల సహకారంతో నియోజకవర్గంలోని ఎనిమిది ఉన్నత పాఠశాలల్లో రక్షిత తాగునీటి ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

**ఉత్తమ ఫలితాలు సాధించాలి**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విద్యా రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా ప్రతి విద్యార్థికి రూ.15 వేలు అందించడంతో పాటు ఉచితంగా దుస్తులు, పుస్తకాలు, బూట్లు ఇస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని, రాజకీయాలకు అతీతంగా విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని ఉద్ఘాటించారు. గత ప్రభుత్వ హయాంలో విద్యా వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నదని, నాడు-నేడు పేరుతో అప్పటి పాలకులు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆయన విమర్శించారు. విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే భారీ ఉపాధ్యాయ నియామక ప్రక్రియ ద్వారా 16,300 కు పైగా పోస్టులను భర్తీ చేశామని గుర్తుచేశారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి పదో తరగతి విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల కోసం సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, విద్యాశాఖ అధికారులు,ఉపాధ్యాయు, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే ఇంటూరి

### -సక్రమంగా పనిచేయడం లేదని వీఆర్వో పై ఆగ్రహం





**కందుకూరు పెన్ పవర్, మార్చి 10**

కోవూరు రోడ్డులో స్వర్ణ వార్డు సచివాలయం -1 ను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. మున్సిపల్ కమిషనర్ అనూషతో కలిసి సచివాలయానికి వెళ్ళిన ఎమ్మెల్యే, మూవ్ మెంట్ రిజిస్టర్ ను పరిశీలించారు. ఈ సచివాలయం సిబ్బందిపై ప్రజల నుంచి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, ఒక్క పని కూడా ముందుకు కదలడం లేదని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. వీఆర్వో వెంకట్రావు విధులకు సక్రమంగా రావడం లేదని, ప్రతిరోజు ఉదయాన్నే రిజిస్టర్ లో సంతకం పెట్టి బయటకు వెళ్ళిపోతున్నాడని పలువురు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. అతని పనితీరు సక్రమంగా లేదన్నారు. ఇటీవల రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే, సరిగా విచారణ చేయకుండానే వాటిని తిరస్కరించాడని చెప్పారు. దీంతో ఎమ్మెల్యే నాగేశ్వరరావు, సబ్ కలెక్టర్ హిమవంశీ కి ఫోన్లో వీఆర్వో వ్యవహారంపై ఫిర్యాదు చేశారు. వీఆర్వోకు మెమో ఇవ్వాలని కోరారు. సచివాలయ సిబ్బంది అందరూ ఖచ్చితంగా సమయపాలన పాటించాలని, పనులు కోసం వచ్చే వారిని పదేపదే తిప్పుకోకుండా బాధ్యతగా ఉండాలని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఆయన వెంట పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, స్థానిక నాయకులు ఉన్నారు.

# వేసవి కాలంలో అప్రమత్తంగా ఉండాలి

### - జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు




**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 10**

వడగాలులు, డీహైడ్రేషన్ వలన ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. ఈ దిశగా తీసుకోవలసిన చర్యలపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఆయన దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసేందుకు రాష్ట్ర హోం మంత్రి వి.అనిత మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ తో పాటు డీఆర్వో బి.చిన ఓబులేసు, ఇతర అధికారులు కూడా ఇందులో పాల్గొన్నారు. అనంతరం జిల్లాలోని పరిస్థితి పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అధిక ఉష్ణోగ్రతల వలన చిన్నారులకు, వృద్ధులకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా దృష్టి సారించాలన్నారు. రోజువారీ కూలీలు, ఉపాధి హామీ కార్మికులు మిట్ట మధ్యాహ్నం వేళలో ఎండలో పనిచేయకుండా చూడాలన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో త్రాగునీటికి, పశువుల దాహార్తి తీర్చేందుకు నీటి కొరత లేకుండా దృష్టి సారించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ట్రాఫిక్ రద్దీ ప్రదేశాలలో వాహనదారులు నిలిచి ఉండే చోట నీడ కోసం షేడ్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. మంచినీటి బోర్ల మరమ్మతులను తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. ఆయా శాఖల వారీగా తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో విపత్తుల నిర్వహణ శాఖ డిపిఎం మాధురి, డిపిఓ వెంకటేశ్వరరావు, డీఈవో రేణుక, జడ్పీ సీఈవో చిరంజీవి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్.ఈ. నాగేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, డిఎంహెచ్వో వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఎస్.ఈ. వరలక్ష్మి, ఒంగోలు మునిసిపల్ కమిషనర్ డాక్టర్ కోడూరి వెంకటేశ్వరరావు, పబ్లిక్ హెల్త్, భూగర్భ జల వనరులు, అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అరుదైన ఐటిపి వ్యాధితో బాధపడుతున్న చిన్నారి లహరిని ఆదుకునేందుకు ముందుకు వచ్చిన ముత్తుముల సంజీవరెడ్డి

**అరుదైన ఐటిపి వ్యాధితో గత చాలా కాలంగా బాధపడుతున్న కొమరోలు మండలం గోనెపల్లి గ్రామానికి చెందిన చిన్నారి లహరి .**

**జీవితాంతం లహరి వైద్యం చికిత్సలు భరించేందుకు హామీ ఇచ్చిన ముత్తుముల సంజీవరెడ్డి.**

**సంజీవరెడ్డికి ధన్యవాదాలు తెలిపిన రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు షేక్ మీర్జా హసీనారా కడప వేణుగోపాల్ రెడ్డి.**

**కొమరోలు పెన్ పవర్ మార్చి 10.**

తల్లిదండ్రులు లేక అవ్వ తాత సంరక్షణలో పెరుగుతున్న చిన్నారి లహరి అరుదైన ప్రమాదకరమైన ఐటిపి వ్యాధితో బాధపడుతున్నదని వైద్య చికిత్సలు చేయించేందుకు తగిన ఆర్థిక స్తోమత కొరవటంతో ఆ చిన్నారి ఆరోగ్య పరిస్థితి ఇబ్బంది కరంగా మారిందనే సమాచారాన్ని రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారుల ద్వారా తెలుసుకున్న కొమరోలు సహకార సంఘం చైర్పర్సన్, మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుల అశోక రెడ్డి సోదరులు ముత్తుముల సంజీవరెడ్డి చిన్నారి లహరికి జీవితాంతం వైద్య చికిత్సలకు అయ్యే ఖర్చును తానే భరిస్తానని ముందుకు వచ్చి పలువురితో ప్రశంసలు అందుకుంటున్నారు. ఈనెల 8వ తేదీన కొమరోలు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న కొమరోలు మండలం రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి కడప వేణుగోపాల్ రెడ్డి కొమరోలు మండలం గోనెపల్లి గ్రామానికి చెందిన పి. లహరి అనే చిన్నారి గత చాలా కాలంగా అరుదైన ఐటిపి వ్యాధితో బాధపడుతున్నదని ,వయస్సు పెరిగే కొలది ఆమె ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారుతున్నదని అందువల్ల లహరికి మెరుగైన వైద్య చికిత్సలు అందించవలసిన అవసరం ఉన్నదని వివరించారు .అయితే తల్లిదండ్రులు లేని లహరి అవ్వ తాత సంరక్షణలో జీవిస్తున్నదని ,ఆర్థిక పరిస్థితి సరిగా లేని లహరి అవ్వతాత లహరికి మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కడప వేణుగోపాల్ రెడ్డి వివరించారు .ఏ చిన్న గాయమైన రక్తం ధారాపాతంగా బయటికి వెళ్లి చిన్నారి లహరి ఆరోగ్యానికి తీవ్ర అవరోధం కలిగించే ప్రమాదం ఉన్నదని డాక్టర్



వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. దయార్థ హృదయం గల దాతలు లహరిని ఆదుకునేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న కొమరోలు మండల తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు ,కొమరోలు సహకార సంఘం చైర్ పర్సన్, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సోదరుడు ముత్తుముల సంజీవరెడ్డి స్పందించి లహరి కి జీవితాంతం అయ్యే వైద్య ఖర్చులను తాను భరిస్తానని ముందుకు వచ్చారు. దీనితో సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, అధికారులు, హర్షద్వానాలు చేస్తూ సంజీవరెడ్డిని ,లహరి ఆరోగ్య పరిస్థితిని వివరించిన కడప కడప



వేణుగోపాల్ రెడ్డిని అభినందించారు .అరుదైన అతి ప్రమాదకరమైన వ్యాధితో బాధపడుతున్న లహరి వైద్య చికిత్స నిమిత్తం అయ్యే ఖర్చును భరించేందుకు ముందుకు వచ్చిన సంజీవరెడ్డిని లహరి అవ్వ తాతలు, బంధువులు, రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు షేక్ మీర్జా హసీనారా, కడప వేణుగోపాల్ రెడ్డి అభినందిస్తూ ధన్యవాదాలు తెలిపారు. లహరికి మెరుగైన వైద్య చికిత్సలు అంది ,ఆ చిన్నారి త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో జీవితం కొనసాగించాలని ఆశీర్వదిస్తూ ఆకాంక్షిద్దాం.

## ఈ నెల 17 నుంచి గిద్దలూరు మున్సిపాలిటీకి స్పెషల్ ఆఫీసర్ పాలన

**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 10**

ఈనెల 17 నుంచి మున్సిపాలిటీ పాలక మండలి పదవులు ముగుస్తుండటంతో స్పెషల్ ఆపీసర్ల ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది .ఈనేపథ్యంలో గిద్దలూరు గ్రేడ్ 2 మున్సిపాలిటీ కి ల్యాండ్ అక్విజిషన్ అండ్ రిలీఫ్ ఒ రీహాబిలిటేషన్ ఒస్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను స్పెషల్ ఆఫీసర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గిద్దలూరు మున్సిపాలిటీ పాలకవర్గం , మున్సిపల్ చైర్మన్ పదవీకాలం ముగియడంతో మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ పాలనలోకి వెళ్లనుంది. ఈ ఉత్తర్వులు ఈనెల 17 నుండి అమల్లోకి రానున్నట్లు అధికారులు తెలిపారు. తదుపరి ఎన్నికలు జరిగే వరకు మున్సిపాలిటీ పరిపాలనను స్పెషల్ ఆఫీసర్ ద్వారా నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. పట్టణంలో అభివృద్ధి పనులు, ప్రజా సేవలు , పరిపాలనా కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

## గోపిక పూర్ణిమకు రెయిన్బో హైస్కూల్ చేయూత




**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ మార్చి 10**

పట్టణానికి చెందిన గోపిక పూర్ణిమ అనే చిన్నారి విద్యార్థిని గోపిక పూర్ణిమ బ్రెయిన్ క్యాన్సర్ తో బాధపడుతుందన్న విషయం తెలుసుకుని, మంగళవారం రెయిన్బో హైస్కూల్ ఆర్థిక చేయూతను అందించింది.ఈ సందర్భంగా చైర్మన్ దొంత కిరణ్ గౌడ్ మాట్లాడుతు తొమ్మిదేళ్ల చిన్నారి మెదడులో క్యాన్సర్ గడ్డ గడ్డ ఏర్పడటం బాధాకరమని, వైద్యం పూర్తయి త్వరగా కోలుకోవాలన్నారు.సాటి విద్యార్థిని ఆరోగ్య బాగుకోసం,, వైద్య ఖర్చులకు తమ హైస్కూల్ విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు వారం రోజులపాటు సహాయ నిధిని సేకరించారని అన్నారు, విద్యార్థుల సేవా దృక్పదాన్ని అభినందించి వసూలు చేసిన నగదును గోపిక పూర్ణిమ కుటుంభ సభ్యులు కృష్ణ కు అందజేశారు. ఈ కార్యక్రమం లొ కొమ్ము రవి, సయ్యద్ ఆబిద్, షేక్ రేష్మా, రెయిన్బో హైస్కూల్ పూర్వ విద్యార్థి సయ్యద్ సాధిక్, పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే తాటిపర్తి గుడ్ మార్నింగ్ యర్రగొండపాలెం



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ మార్చి 10**

నిత్యం ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ప్రజా వ్యతిరేక విధానాలపై గళమెత్తి ప్రశ్నిస్తూ బిజిగా ఉండే స్థానిక ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మంగళవారం పట్టణంలోని ఖాసీం పీరా టీ స్టాల్ వద్ద గుడ్ మార్నింగ్ యర్రగొండపాలెం అంటు అందరిని పలుకరించారు. పట్టణ ప్రజలతో, కార్యకర్తలతో ఛాయ్ బాత్ నిర్వహించారు.నిత్యం రద్దిగా ఉండే ప్రధాన సెంటర్లోని టీ దుకాణం వద్ద, అందరిని పేరు పేరున పలకరిస్తు సమాచారాలు అడిగి తెలుసుకున్నారు.ఎన్నికల సమయంలోనే జన సమూహంలో, హోటల్ల వద్ద వివిధ ప్రదేశాలలో ఎమ్మెల్యే లు, మంత్రులు దర్శనం ఇస్తుంటారు.ఒక ఎమ్మెల్యే సాధారణ వ్యక్తిలా వాకింగ్ చేసుకుంటూ టీ స్టాల్ వద్దకు చేరుకోవడంతో ప్రజలు ఆయనతో కరచాలనం చేస్తూ ముచ్చటించడం అందరిని ఆకట్టుకుంది.ప్రజలతో సత్సంబంధాలు ఉండి నేను మీ వాడినే అనే నాయకుడు సామాన్యుడిలా ప్రజలతో మమేకం అయితే ఆదరణ తగ్గదనేది వాస్తవం.

## డ్రగ్స్ వద్దు బ్రో - గంజాయి వంటి మాదక ద్రవ్యాల వాడకం వలన కలిగే అనర్థాలు, దుష్పరిణామాలపై ఆటో డ్రైవర్ లకు అవగాహన కల్పించిన జిల్లా ఎస్పీ

**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 10**

మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిర్మూలనే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. మంగళవారం జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో జరిగిన కార్యక్రమంలో గంజాయి వంటి మాదక ద్రవ్యాల వాడకం వలన కలిగే అనర్థాలు, దుష్పరిణామాలు, ఎదుర్కోవాల్సిన చట్టపరమైన చర్యలు, శిక్షలు పై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వినియోగం వలన ప్రజల ఆరోగ్యానికి కలిగే నష్టాలను గురించి, యువత మత్తుకు బానిసవ్వడం వలన భవిష్యత్తులో ఏవిధంగా వారి జీవితాలు పాడవుతాయో కూడా వివరించటం జరిగింది. గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా సమాజానికి పెద్ద ప్రమాదమని తెలిపారు. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఈ దిశగా పోలీస్ శాఖ నిరంతరం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, చెడు అలవాట్ల బారిన పడకుండా ఆరోగ్యకరమైన జీవనం గడపాలని "డ్రగ్స్ వద్దు బ్రో" అనే సందేశాన్ని ఆటో డ్రైవర్లకు తెలియజేశారు. మత్తు పదార్థాల నిర్మూలన ద్వారా ఆరోగ్యవంతమైన, నేరరహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రకాశం జిల్లా పోలీస్ శాఖ పనిచేస్తోందని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు తెలిపారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలను రవాణా చేసే, విక్రయించే, నిల్వ చేసే లేదా వినియోగించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని



హెచ్చరించారు. గంజాయి, మాదకద్రవ్యాల సమాచారం ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972, డయల్ 112, లేదా పోలీస్ వాట్సాప్ నంబర్ 9121102266 కు తెలియజేయవచ్చు అని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పోలీసులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డిఎస్పీ రాయపాటి. శ్రీనివాసరావు, ఎఆర్.డీఎస్పీ కె.శ్రీనివాసరావు, ఒంగోలు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ జగదీష్, ఒంగోలు వన్ టౌన్ సీఐ నాగరాజు, ఒంగోలు టు టౌన్ సీఐ శ్రీనివాసరావు, ఆర్ఐ రమణారెడ్డి, ట్రాఫిక్ ఎస్సై కోటయ్య,శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

## పవర్ లిఫ్టింగ్ పోటీల విజేతలకు కలెక్టర్ అభినందనలు



**కలెక్టరేట్ ఒంగోలు,పెన్ పవర్ మార్చి 10**

ప్రకాశం జిల్లాకు చెందిన క్రీడాకారులు బెంగళూరులో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని కాంస్య పతకాలు సాధించారు.రెండు రోజులపాటు కర్ణాటక రాష్ట్రం బెంగళూరు వేదికగా జరిగిన సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ 2025-26 పోటీలలో ప్రకాశం జిల్లాకు చెందిన క్రీడాకారులు విజయం సాధించారు. 57 కేజీల విభాగంలో యమ్. కావ్య కాంస్య పథకం, 120 కేజీల విభాగంలో జి. శక్తీ ధర శ్రీచంద్ర కాంస్య పథకం సాధించారు. ఇరువురిని జిల్లా కలెక్టర్ పి. రాజబాబు ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ జి.రాజారాజేశ్వరి,ప్రకాశం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ జి. భక్తధ్రువుడు, ప్రకాశం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్-ప్రెసిడెంట్ జి. పవన్ కుమార్ లు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్టు

### 30 వేల రూపాయల గంజాయి డిజిటల్ ఎలక్ట్రికల్ కాటా స్వాధీనం

### మార్కాపురం డి వై ఎస్పీ నాగరాజు



**గిద్దలూరు పెన్ పవర్ మార్చ్ 10**

చెడు వ్యసనాలకు బానిస అయ్యి అక్రమంగా డబ్బులు సంపాదించాలని ఉద్దేశ్యం తో ముగ్గురు వ్యక్తులు గంజాయి విక్రయిస్తు పోలీసులు కంట పడి కటకటాల పాలయ్యారు. మంగళవారం నాడు డి వై ఎస్పీ నిర్వహించిన పాత్రికేయుల సమావేశ శీ లో ముద్దాయి ల ను ప్రవేశ పెట్టి వివరాలు వెల్లడించారు. గిద్దలూరు మండలం కృష్ణం శెట్టి పల్లి గ్రామానికి చెందిన ఆలమూరి చంద్రయ్య అదే గ్రామానికి చెందిన డిగపాటి వెంకటేష్ అలియాస్ లడ్డు ఇదే మండలం వెంగలరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బిజ్జమ్ వెంకట శ్రీ రామ రెడ్డి అలియాస్ ఇంద్ర సేనా రెడ్డి లు ముగ్గురు మంగళవారం మధ్యాహ్నం 12:30 సమయంలో కృష్ణం శెట్టి పల్లి ఉప్పల పాడు గ్రామాల మధ్య గల బ్రిడ్జి వద్ద అరెస్ట్ చేసి ముగ్గురు ముద్దాయి ల నుండి మూడు కేజీల గంజాయిని ,గంజాయి తూకం వేసే డిజిటల్ చిన్న కాటా ను స్వాధీనం చేసుకున్నామని డి వై ఎస్పీ నాగ రాజు తెలిపారు. వివరాల్లోకి వెళితే ఆలమూరి చంద్రయ్య డిగపాటి వెంకటేష్,బిజ్జమ్ వెంకట శ్రీ రామ రెడ్డి లు చెడు వ్యసనాలకు బానిస అయ్యి అక్రమం గా డబ్బు సంపాదించాలని చెడు ఉదేశ్యం తో గంజాయి వ్యాపారం మొదలు పెట్టారని తెలిపారు. ఆలమూరి చంద్రయ్య విజయనగరం ప్రాంతం నుండి గంజాయిని రైల్ లో తీసుకొని వచ్చి డిగపాటి వెంకటేష్,బిజ్జమ్ వెంకట శ్రీ రామ రెడ్డి ల తో కలిసి కొంత కాలం గా అమ్ముకుంటు కలిసి గిద్దలూరు పట్టణం పరిసర గ్రామాల్లో గుర్తు తెలియని వాళ్ళ కు పది గ్రాముల గంజాయిని ఐదు వందల రూపాయల కు అమ్ముకుంటు జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమం లో నే మంగళవారం ముగ్గురు వ్యక్తులు కలిసి ఉప్పల పాడు సమీపం లో గల బ్రిడ్జి వద్ద చేరుకొని ఆలమూరి చంద్రయ్య వద్ద మిగిలిన గంజాయిని డిగపాటి రమేష్ ,శ్రీ రామ రెడ్డి ల కు అమ్మి అనంతరం అందరూ కలిసి వారి వద్ద గల గంజాయిని పది గ్రాముల చొప్పున ప్యాకెట్ తయారు చేస్తున్న క్రమం లో పోలీసులు వారిని అరెస్టు చేశారని డి వై ఎస్పీ తెలిపారు. ఈ కేసు ను ఛేదించటం లో గిద్దలూరు అర్బన్ సి ఐ సురేష్, ఎస్ ఐ ఇమ్మానుఎల్ ను డి వై ఎస్పీ నాగరాజు అభినందించారు.

## నేటి నుంచి జాతీయ స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు



**కొనకనమిట్ల పెన్ పవర్ మార్చి 10**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెలుగొండ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నేటి నుంచి మూడు రోజులపాటు జాతీయ స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ కుందూరు కాశీరెడ్డి తెలిపారు.మార్చి 11,12,13 తేదీలలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు.మార్చి 11వ తేదీన ఆరుపళ్ల సైజ్ విభాగంలో, 12వ తేదీన న్యూ కేటగిరీ విభాగంలో,13వ తేదీన సీనియర్ విభాగాల్లో ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.ఈ పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా ఎడ్ల బండల యజమానులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారని పేర్కొన్నారు.పోటీల నిర్వహణకు ఆలయ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక ప్రాంగణాన్ని సిద్ధం చేసినట్లు తెలిపారు.పోటీలను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు, క్రీడాభిమానులు తరలివచ్చే అవకాశం ఉండటంతో అవసరమైన భద్రతా ఏర్పాట్లు కూడా చేపట్టినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఎడ్ల బండలకు నగదు బహుమతులు,ట్రోఫీలు ప్రదానం చేయనున్నట్లు వారు వెల్లడించారు.పోటీలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 8008716521, 9505345703, 9963429928, 9581137317 నంబర్లను సంప్రదించాలని ఉత్సవ కమిటీ సభ్యులు సూచించారు.

## భైరవేశ్వర స్వామిని సన్నిధిలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి నిర్మలాజ్యోతి

**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 10**

ప్రకాశం జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ శైవ పుణ్యక్షేత్రమైన భైరవకోనలోని భైరవేశ్వర స్వామి సన్నిధిని మంగళవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఎస్. నిర్మల జ్యోతి దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ముప్పాళ్ల శ్యామ్ సుందర్ రాజు, ఆలయ కార్యనిర్వాహణాధికారి వంశీకృష్ణారెడ్డి సూచనల మేరకు ఆలయ సిబ్బంది ఆమెకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య గోత్రనామాలతో ఆశీర్వదించి అభిషేక పూజలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం తరపున నిర్మల జ్యోతిని శేష వస్త్రాలతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భైరవకోన మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ గుంటిమడుగు వెంకట



రామరాజు, అంబవరం బిసి హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వర్లు, ఆలయ సిబ్బంది, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.


# లారీ ఢీకొని 30 గొర్రెలు మృతి

**కొమరోలు నుంచి కడప జిల్లా నాగల కుంట్ల గ్రామానికి రోడ్డు వెంట తరలించుకువెళ్తున్న గొర్రెల మందను ఢీకొన్న లారీ.**

**చక్రాల కింద పడి నలిగి 25 గొర్రెలు ,ఐదు పొట్టేలు మృతి -మరి కొన్ని మూగజీవాలకు తీవ్ర గాయాలు.**

**కొమరోలు గ్రామం వెలుపల గల నయారా పెట్రోల్ బంకు సమీపంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదం.**





**కొమరోలు పెన్ పవర్ మార్చి 10**

రోడ్డు మార్జిన్ లో వెళుతున్న గొర్రెల మందను ఎదురుగా వేగంగా వస్తున్న ఇసుక లోడు లారీ ఢీకొనడంతో లారీ చక్రాల కింద పడి మందలోని 25 గొర్రెలు, ఐదు పొట్టేలు మృత్యువాత పడ్డ సంఘటన మంగళవారం తెల్లవారుజామున కొమరోలు గ్రామ వెలుపలగల నయారా పెట్రోల్ బంకు సమీపంలో జరిగింది. అందిన వివరాల మేరకు వైయస్సార్ కడప జిల్లా నాగలకుంట్ల గ్రామానికి చెందిన కమ్మినెత్తి రామయ్య, తెల్ల కృష్ణయ్య, వెంకటరెడ్డి, రామయ్య ,భాస్కర్ ,ప్రవీణ్ అనే జంతు పోషకులు పలు గ్రామాలలో పర్యటించి గొర్రెలు, పొట్టేళ్లను కొనుగోలు చేసి వాటిని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అందులో భాగంగా సదరు 6 మంది జంతు పోషకులు ఇటీవల గిద్దలూరు నియోజకవర్గంలోని పలు గ్రామాలలో పర్యటించి 250 గొర్రెలు పొట్టేళ్లను కొనుగోలు చేశారు .వాటిని సోమవారం గిద్దలూరు మండలం పొదలకుంట పల్లెకు చేర్చి అక్కడి నుండి రాత్రికి కొమరోలు గ్రామానికి తరలించారు. కొమరోలు గ్రామం వెలుపల రాత్రి బస చేసిన గొర్రెలను మంగళవారం తెల్లవారుజామున నాగలకుంట్ల గ్రామానికి తరలించుకుని వెళ్లేందుకు కడప అమరావతి జాతీయ రహదారి మీదుగా ప్రయాణం సాగించారు. అయితే తెల్లవారుజామున 4 గంటల సమయంలో పోరుమామిళ్ల వైపు నుంచి కొమరోలు వైపుకు అతివేగంగా వస్తున్న ఇసుక లోడు లారీ కొమరోలు గ్రామం వెలుపలగల నయారా పెట్రోల్ బంకు సమీపంలో రోడ్డు మార్జిన్లో వెళుతున్న గొర్రెల మందను లారీ ఢీకొన్నది .ఆ ప్రమాదంలో లారీ చక్రాల కింద పడి 25 గొర్రెలు, ఐదు పొట్టేల్లు నలిగి మృత్యువాత పడ్డాయి. దీనితో మూగజీవుల శరీరాలు ఛిద్రమయ్యాయి. మరికొన్ని గొర్రెలు, పొట్టేలు తీవ్రంగా గాయపడ్డాయి. దీనితో తీవ్ర ఆవేదన గురైన జంతు పోషకులు సమాచారాన్ని కొమరోలు పోలీసులకు అందించారు. మంగళవారం ఉదయం కొమరోలు ఎస్సై నాగరాజు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. లారీ చక్రాల కింద పడి నలిగిపోయి మృత్యువాత పడిన జీవాల మృతదేహాలను రోడ్డు మార్జిన్ కు తొలగించి వాహన రాకపోకలకు రాకపోకలకు సౌకర్యం కల్పించారు. కాగా బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై తెలిపారు. ప్రమాదానికి గురైన లారీని పోలీస్ స్టేషన్ కు తరలించారు. అతివేగంగా వస్తున్న లారీ గొర్రెల మందపై వెళ్లడంతో 30 జీవాలు మృతి చెందాయని దీనితో తమకు 6 లక్షల మేర నష్టం వాటిలిందని బాధితులు వాపోయారు.

## దద్దాలను సన్మానించిన ముల్లంగి శ్రీహరి రెడ్డి



**పామూరు, పెన్ పవర్, మార్చి10**

పుట్టినరోజు వేడుకలలో భాగంగా కొత్తూరు విచ్చేసిన సందర్భంగా కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ మరియు పార్టీ శ్రేణులను తన నివాసానికి ఆహ్వానించి దుశ్శాలువలతో ఘనంగా సన్మానించిన కనిగిరి మండలం రైతు విభాగం అధ్యక్షులు ముల్లంగి శ్రీహరి రెడ్డి. ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్ గఫార్, మడతల కస్తూరి రెడ్డి, గుంటక తిరుపతిరెడ్డి, తమ్మినేని సుజాత, సిరుప గోవర్ధన్ రెడ్డి, అచ్చాల శ్రీనివాసులరెడ్డి, పోలక సిద్ధారెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, మల్లెల యాకోబు, మూలే మాలకొండ రెడ్డి,భూమిరెడ్డి రామచంద్రారెడ్డి, సంగటి మహేందర్ రెడ్డి, పైడాల మోహన్ రెడ్డి, దాదిరెడ్డి మాలకొండ రెడ్డి, దుగ్గిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 10**

గిద్దలూరు మండలం దిగువమెట్టలో మంగళవారం కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. నంద్యాల నుంచి గిద్దలూరు వైపు వెళ్తున్న కారు టైర్ ఒక్కసారిగా పంచర్ కావడంతో అదుపు తప్పి పక్కనే ఉన్న స్తంభానికి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. అదృష్టవశాత్తు కారులో ఉన్న ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనతో స్థానికంగా కాసేపు కలకలం రేగింది.

## 13 వ రోజు ఇంటర్మీడియట్ పరీక్షకు 45 మంది గైర్హాజరు



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 10**

ఇంటర్మీడియట్ థియరీ పరీక్షల్లో భాగంగా 13 వరోజు మంగళవారం నాడు మొదటి సంవత్సరం విద్యార్థులకు పరీక్ష నిర్వహించబడింది. భౌతిక శాస్త్రం -1 తో పాటు ఒకేషనల్ వారికి బ్రిడ్జి కోర్సు ఫిజికల్ సైన్సెస్ -1 ఈ రోజు నిర్వహించబడ్డాయి. కస్టోడియన్ వి. పూర్ణ చంద్రుడు తనిఖీ నిర్వహించారు. పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు ఎం. మురళీకృష్ణ,ఎ.అల్లూరయ్య,ఆర్. శిరీష కుమారి హాజరు వివరాలను తెలిపారు. పట్టణములోని మూడు పరీక్ష కేంద్రాలకు 678 మంది హాజరవ్వాల్సి ఉండగా 633 మంది హాజరు కాగా 45 మంది గైర్హాజరయ్యారు. కేంద్రాల వారీగా వివరాలిలా ఉన్నాయి. శ్రీ వివేకానంద జూనియర్ కళాశాలలో 231 మందికి 217 మంది హాజరు కాగా 14మంది గైర్హాజరయ్యారు. శ్రీ జీవనజ్యోతి జూనియర్ కళాశాలలో 259 మందికి 244 మంది హాజరు కాగా 15 మంది గైర్హాజరయ్యారు.సాహితి జూనియర్ కళాశాలలో 188 మందికి 172 మంది హాజరై, 16 మంది గైర్హాజరయ్యారు.

## క్విస్ కళాశాలలో 12న యూత్ పార్లమెంట్




**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు మార్చి 10**

ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 12న వికసిత భారత్ యూత్ పార్లమెంట్ ను నిర్వహిస్తున్నట్లు క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి దేవి తెలియజేశారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖకు చెందిన మై భారత్, క్విస్ కళాశాల ఎన్ ఎస్ ఎస్ యూనిట్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలోని రామానుజన్ సెమినార్ హాల్లో జిల్లా స్థాయిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 50 సంవత్సరాల అత్యవసర పరిస్థితి.. భారత ప్రజాస్వామ్యానికి పాఠాలు అనే అంశంపై యూత్ పార్లమెంట్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు దానికి సంబంధించిన పోస్టర్ ను ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఉపకులపతి డి.వి.ఆర్ మూర్తి ఆవిష్కరించారు. జిల్లాస్థాయిలో నిర్వహించే ఈ పోటీల్లోప్రతిభ కనబరిచే 10 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధిస్తారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వ్యవస్థాపక రిజిస్ట్రార్ బి. హరి బాబు, మై భారత్ జిల్లా యువజన అధికారి ఎ. మహేందర్ రెడ్డి, క్విస్ కళాశాల ఎన్ ఎస్ ఎస్ డీన్ డాక్టర్ నవనీత కృష్ణన్, స్టూడెంట్స్ అసోసియేట్ డీన్ డాక్టర్ వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆధిపత్య పోరు కోసమే యుద్దాలు

**చిన్న దేశాల పై పెద్ద దేశాల దాడి**

**యుద్ధాలు ప్రపంచ ఆర్థిక పరిస్థితులకు విఘాతం, పర్యావరణానికి పెను ముప్పు**

**గిద్దలూరు పెన్ పవర్ మార్చ్ 10**

ఆధిపత్య పోరు కె అగ్ర రాజ్యాలు పోటీ పడుతున్నాయని చిన్న రాజ్యాల పై దాడులు చేసి వారి సంపద ను కొల్ల గొట్టే ప్రయత్నం లో భాగం గా నే నేడు యుద్ధాలు జరుగుతున్నాయని ఈ యుద్ధాలు ఆపి ప్రపంచ శాంతి కోసం కృషి చేయాలని ఐక్య రాజ్య సమితి కీలక పాత్ర పోషించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి రవీంద్ర నాధ్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నాడు విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనం లో ప్రపంచ శాంతి అనే అంశంపై చర్చా గోష్ఠి ని విశ్రాంత సర్వేయర్ రెడ్డి మల్ల రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జి రవీంద్ర నాథ్ రెడ్డి మాట్లాడుతూ ఆధిపత్యం కోసమే అగ్ర రాజ్యాలు చిన్న రాజ్యాల పై దాడి చేసి అక్కడి సంపద ను దోచుకోవాలనే ప్రయత్నం లో భాగంగా నే యుద్ధాలు చేస్తున్నాయని అభిప్రాయ పడ్డారు. ప్రపంచ శాంతి అనేది కేవలం యుద్ధాలు లేదా హింస లేకపోవడం మాత్రమే కాదని దేశాల మధ్య ప్రజల మధ్య సహకారం ,సోదర భావం ,పరస్పర గౌరవం కలిగిన ఆదర్శవంతమైన స్థితి ,మానవాళి మనుగడ కు ప్రపంచ ప్రగతి కి పునాది వంటిది అన్నారు.శాంతి యుత వాతావరణం లో నే ప్రజలందరికీ సమాన హక్కులు,స్వేచ్ఛ న్యాయం అందుతాయన్నారు.యుద్ధాల వల్ల వనరులు విధ్వంసం కు గురి అవుతాయని అణ్వాయుధాలు, యుద్ధ తంత్రాలు పర్యావరణానికి త్రీవ్ర నష్టం కలిగిస్తాయని కాకుండా ఆర్థికాభివృద్ధి పై పెను మార్పులు సంభవించి ప్రజల పై కూడా పెను భారం మోపవలసి వస్తుందని ఆయన పేర్కొన్నారు. ఐక్య రాజ్య సమితి వంటి సంస్థ ల ద్వారా దేశాల మధ్య వివాదాల ను దౌత్య పరంగా పరిష్కించుకోవాలన్నారు.ప్రపంచ శాంతి అనేది ఒక్కరి తో సాధ్యం అయ్యేది కాదనీ ఇది ప్రతి ఒక్కరి భాద్యత అని మతాలు, జాతులు,సరిహద్దు ల కు అతీతంగా వసుధైక కుటుంబ శీ అనే భావం తో వెలిగితేనే రాబోయే తరాలకు శాంతి యుత ప్రపంచాన్ని అందివ్వగలమన్నారు. ప్రపంచ శాంతి కి పునాది వ్యక్తిగత శాంతి అని వ్యక్తులు తమ లో తాము శాంతి ని అనుభవించినప్పుడే మార్పులు వస్తాయన్నారు.నేటి యుద్ధాలు ఆధిపత్య పోరు తో నే జరుగుతున్నాయని



వీటి వల్ల ఆస్తి నష్టం ,ప్రాణ నష్టం, సహజ సంపద నశించిపోతాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ రణ రంగం వల్ల న రవాణా సౌకర్యం స్తంభించి ,గ్యాస్ ,పెట్రోల్, డీజిల్, ఆహార పదార్థాల ధరలు పెరిగి ప్రజల పై పెను భారం పడుతుందన్నారు.అగ్ర రాజ్యాలు తాము చేసిన యుద్ధ సామాగ్రి ని ఆయుధాల ను విక్రయించేందుకు రాజ్యాల మధ్య వైషమ్యాలు పెంచి యుద్ధ వాతావరణం సృష్టించి తమ యుద్ధ ఆయుధాల ను విక్రయించుకుంటున్నారు అని పేర్కొన్నారు. రెడ్డి మల్ల రెడ్డి మాట్లాడుతూ ఈ యుద్ధం లో ఎంతో ఆస్తి నష్టం కలిగి ఎందరో చిన్నారులు తమ ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. నేడు జరుగుతున్న యుద్ధం అంతర్జాతీయ న్యాయ సూత్రాల కు విరుద్ధమని ఐక్య రాజ్య సమితి దీని స్పందించకపోవడం శోచనీయం అన్నారు.ఈ కార్యక్రమంలో బి ఆది నారాయణ ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగ టీచర్ బి ఎస్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొని ప్రపంచ శాంతి కోసం తమ తమ అభిప్రాయాలను వెల్లడించారు.

## మత్స్య సంపద పెంపుకు పరిశోధనా కేంద్రాల ఏర్పాటుపై మాగుంట ప్రశ్న

**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు మార్చి 10**



దేశంలో , ఆంధ్రప్రదేశ్ లో చేపల పెంపుదలకు అదనపు పరిశోధనా సంస్థలు మరియు ప్రాంతీయ కేంద్రాల ఏర్పాటు,పథకాలు, నిధులు మరియు ప్రభుత్వ -- ప్రైవేటు భాగస్వామ్యం గురించి ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ప్రశ్నను లేవనెత్తారు. కేంద్ర మత్స్య, పశు సంవర్ధక, పాడిపరిశ్రమ శాఖామంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లలన్ సింగ్ సమాధానమిస్తూ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ( ఐసిఏఆర్) నివేదిక ప్రకారం, దేశంలో ప్రత్యేక కార్యాచరణ గల 30 ప్రాంతీయ స్టేషన్లతో 8 మత్స్య పరిశోధనా కేంద్రాలు పనిచేస్తుండగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాకినాడలో 1 , విశాఖపట్నంలో 2, విజయవాడ లో 1 ప్రాంతీయ పరిశోధనా కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు. చేపల ఉత్పత్తి పెంపుదల, సుస్థిర నీటి వినియోగం, నీటి సంరక్షణ, పర్యావరణ, నిర్వహణ తదితర అంశాలతోపాటు ఈ కేంద్రాలలో మత్స్య సైన్సు బోధన, పరిశోధన, సాంకేతికతల అభివృద్ధిపై పనిచేస్తాయని తెలిపారు. రాష్ట్రంలో నాణ్యమైన విత్తన, చేపల ఉత్పత్తి, పెంపకం నియంత్రణ, ఉత్పత్తి సంబందిత తదితర విషయాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కీలక చట్టాలు రూపొందించి మత్స్య విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటుచేసి, గత 3 సం.లలో 40,000 కస్టమర్లకు సాంకేతిక మద్దతు, శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. నాణ్యమైన చేపల పెంపుదలతోపాటు అభివృద్ధి చెందిన చేపల జాతులు, ఆరోగ్యం, సంరక్షణ, వ్యాధుల నిర్ధారణ, పరిశోధనకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ మత్స్య శాఖ వారు రాష్ట్ర విశ్వవిద్యాలయం, ప్రైవేటు రంగ సంస్థల భాగస్వామ్యంతో పలు కార్యక్రమాలను అమలుచేయుచున్నదని కేంద్ర మంత్రి తెలియజేశారు.

## గ్రామానికి తారురోడ్డు మంజూరు ఎమ్మెల్యే

**గ్రామ ప్రజల ఘన సన్మానం**



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 10**

కంబం మండలం ఎర్రబాలెం గ్రామానికి ఎన్నో సంవత్సరాలుగా సరైన రోడ్డు మార్గం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిన వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి 1 కోటి 50 లక్షల రూపాయల తో కొత్త తారురోడ్డు మంజూరు చేయించి పనులను పూర్తి చేయించారు రోడ్డు నిర్మాణం పూర్తవడంతో గ్రామ ప్రజలు, నాయకులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే అశోక్ రెడ్డిని ఆయన నివాసంలో మంగళవారం కలిసి శాలువా కప్పి, పూలమాల తో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుం టామని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పేర్కొన్నారు. మంచి ప్రభుత్వానికి, అభివృద్ధి కి పాటుపడేవారి అండగాఉండాలని కోరారు.

## చిమట అంగన్వాడి కేంద్రాల ఆధ్వర్యంలో పరిశుభ్రత వారోత్సవాలు

**పొదిలి, పెన్ పవర్, మార్చి 10**

మర్రిపూడి మండలం లోని చిమట గ్రామ అంగన్వాడి కేంద్రాల ఆధ్వర్యంలో పరిశుభ్రత వారోత్సవాలు జరిగాయి. పరిశుభ్రత వారోత్సవాల సందర్భంగా ఒకటవ తేదీ నుండి 15వ తేదీ వరకు పరిశు భ్రత వారోత్సవ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లో పరిశుభ్రతతో పాటు బాల్య వివాహాల పట్ల అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అలాగే పరిశుభ్రత పట్ల పాటించాల్సిన పద్ధతులను ప్రదర్శించడంతోపాటు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తల నాయకులు కే స్వాతి, రాధ జ్యోతి, లక్ష్మీ కుమారి, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి తో భేటీ అయిన

# మార్కాపురం జిల్లా ప్రధాన హౌసింగ్ అధికారి

**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 10**

మార్కాపురం జిల్లా గృహనిర్మాణ శాఖ నూతన జిల్లా అధికారి యం. వి.మోహన్ రావు , గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. శాసనసభ్యులు నియోజకవర్గ పురోగతిపై , ఆవాస్ ప్లస్ గ్రామీణ పథకం నూతన మంజూరులపై చర్చించారు. అనంతరం మార్కాపురం ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ , అందె పవన్ కుమార్, ఉపకార్యనిర్వహక ఇంజనీర్ షేక్ ఖదీర్ బాషాలతో కలిసి గిద్దలూరు సబ్ డివిజన్ పరిధిలోని ఆరు మండలాల సహాయక ఇంజనీర్లు, వర్క్ ఇన్స్పెక్టర్లతో సమీక్షాసమావేశం నిర్వహించారు. సమీక్షలో ఉగాది నాటికి పూర్తి చేయవలసిన లక్ష్యాలపై , గ్రామీణ పథకం నూతన మంజూరులపై సిబ్బందితో సమీక్షించి, ఉగాది నాటికి లక్ష్యాలను చేదించి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉగాది రోజు నిర్వహించబోయే సామూహిక గృహప్రవేశాలకు సిద్ధముగా ఉండాలని సూచించారు. సమీక్ష అనంతరం గిద్దలూరు నగరపంచాయితీ కమీషనర్ తో కలిసి మున్సిపాలిటీ పరిధిలోని కొండపేట పి.యం. ఏ.వై - ఎన్టీఆర్ నగర్ కాలనీ, నల్లబండ బజార్ పి.యం. ఏ.వై - ఎన్టీఆర్ నగర్ కాలనీలను సందర్శించారు.



సందర్శన సమయములో సదరు లేఅవుట్ల నందు పెరిగిన చిల్లచెట్లను, నీటి సమస్యలను కమీషనర్ దృష్టికి తీసుకువెళ్లగా, సదరు లేవుట్లలో



వెంటనే జంగిల్ క్లియరెన్స్ చేయించి, నీటి సమస్యపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్శనలో గిద్దలూరు సహాయక ఇంజనీర్ యం. మహేశ్వర రెడ్డి, గృహనిర్మాణ శాఖ సిబ్బంది, వార్డు అమెనిటీస్ కార్యదర్శులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**ఎంఈఓ రాజాల కొండారెడ్డి**



**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 10**

పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖాధికారి రాజాల కొండారెడ్డి తెలిపారు మండల కేంద్రంలోని సి ఎస్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు రత్నం జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాలను ఆయన మంగళవారం పరిశీలించారు పరీక్షల సమయంలో విద్యార్థులు కింద కూర్చొని రాసేలా ఉండరాదని సూచించారు విద్యార్థులు కూర్చోవడానికి అవసరమైన బల్లలు ఫర్నిచర్ పరీక్షా కేంద్రాలకు సమకూర్చారని అన్నారు అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తనిఖీ చేశారు మెనూ ప్రకారం మాత్రమే విద్యార్థులకు అందించాలని కుకింగ్ ఏజెన్సీలకు దూషించారు పరీక్షా కేంద్రాల పరిశీలన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఖాద రున్నీసాబేగం, చీఫ్ సూపరిండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు ఉన్నారు.

# విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని అందజేసిన సేవ స్వచ్ఛంద సంస్థ




**మార్కాపురం పెన్ పవర్ మార్చి 10**

10వ తరగతి పరీక్షల నేపథ్యంలో 120 మంది విద్యార్థులకు పరీక్ష సామాగ్రి ని స్వచ్ఛందంగా సేవా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కందుల అనిల్ కుమార్ పంపిణీ చేశారు. తర్లుపాడు మండలం మీర్జపేట, నాగేళ్ళాముడుపు, తాడివారిపల్లిలలోని ఎస్సీ బీసీ హాస్టల్ లోని సుమారు 120 మంది పదవ తరగతి విద్యార్థుల కు పరీక్ష అట్టలు, పెన్నులు, పెన్సిల్స్, అరైజర్,చెప్నర్లు , స్కెల్స్, హాల్ టికెట్ పౌచ్లు, మొదలగు పరీక్ష సమగ్రీ ని సొసైటీ ఫర్ ఎన్విరాన్మెంటల్ విలేజ్ ఆక్టివిటీస్ సేవా స్వచ్ఛంద సేవ సంస్థ వారు ఉచితంగా పంపిణి చేసారు. విద్యార్థులు అందరూ ఒత్తిడి కి గురి కాకుండా, ప్రశాంతగా పరీక్షలు రాసి అందరూ వంద శాతం ఉతీర్ణత సాధించాలని సంస్థ డైరెక్టర్ కందుల అనిల్ కుమార్ ఆకాక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థి విద్యార్థునులు సేవా స్వచ్ఛంద సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం లో సంస్థ ప్రతినిధులు కిరణ్ కుమార్, శ్యాంబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసతిగృహాల వార్డెన్లు, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



**పొదిలి, పెన్ పవర్, మార్చి 10,**

రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన పొదిలి-ఒంగోలు రహదారిలోని అగ్రహారం గ్రామ సమీపంలో జరిగింది. మండలంలోని గోగినేని వారి పాలెం గ్రామానికి చెందిన రత్తయ్య అనే వ్యక్తి మోటార్ సైకిల్ పై వెళుతుండగా. అటువైపుగా వస్తున్న ఒక టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో రత్తయ్య తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన తర్వాత టిప్పర్ డ్రైవర్ ఆపకుండా, టిప్పర్ తో సహా పరాలయ్యాడు. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం పొదిలి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఈ సంఘటనపై పొదిలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# ఎన్ఫోర్స్మెంట్ డిటిగా విజయభాస్కర్ నియామకం

**కందుకూరు పెన్ పవర్, మార్చి 10:**

కందుకూరు నియోజక వర్గం ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తాహశీల్దార్ గా ఎస్. విజయభాస్కర్ నియమించబడ్డారు. ఈయన నియోజకవర్గంలోని పలు తహసిల్దార్ కార్యాలయాల్లో గతంలో వివిధ హోదాల్లో పనిచేసి, సముచిత సేవలందించారు.



# అల్లినగరం గ్రామపంచాయతీ వైసిపి సోషల్ మీడియా వింగ్ అధ్యక్షులుగా కానగారి రామయ్య.

**సోషల్ మీడియా వింగ్ అధ్యక్షులుగా నియమించిన వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డికి, వైసీపీ నాయకులకు ధన్యవాదాలు తెలిపిన రామయ్య.**

**కొమరోలు పెన్ పవర్ మార్చి 10**

కొమరోలు మండలం అల్లినగరం గ్రామపంచాయతీ వైసీపీ సోషల్ మీడియా వింగ్ అధ్యక్షులుగా ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన కానగారి రామయ్యను వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో నియమిస్తూ వైసీపీ జిల్లా కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. అల్లినగరం పంచాయతీలోని ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన కానగారి రామయ్య వైసీపీ పార్టీలో చురుకుగా పనిచేస్తూ ,పార్టీ అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంటూ పార్టీ నేతల తో గుర్తింపు పొందారు .దీనితో రామయ్యను అల్లినగరం గ్రామపంచాయతీ వైసిపి సోషల్ మీడియా వింగ్ అధ్యక్షునిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు .తన సేవలను గుర్తించి తనకు అల్లినగరం గ్రామపంచాయతీకి వైసిపి వింగ్ అధ్యక్షులుగా నియమించిన వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, రాష్ట్రస్థాయి వైసీపీ నేతలకు, తన పేరును సిఫారసు చేసిన గిద్దలూరు



నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త కుందూరు నాగార్జున రెడ్డికి ,కొమరోలు జడ్పిటిసి సభ్యులు సారే వెంకటనాయుడుకు ,మండల వైసీపీ సీనియర్ నాయకులు నాదెళ్ల వెంగయ్య చౌదరికి, అల్లినగరం గ్రామపంచాయతీ వైసీపీ నాయకులు ,గిద్దలూరు నియోజకవర్గ వైసిపి ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ విభాగం అధ్యక్షులు బంగారు విశ్వరూపం, అల్లినగరం గ్రామ సర్పంచ్ బంగారు రత్నాలు, ఎంపిటిసి సభ్యులు జాజం వెంకటరమణ ,మాజీ ఎంపిటిసి సభ్యులు బంగారు నారాయణమ్మ ,గోల్కొండ చాంద్ బాషా, అబ్దుల్ సుభాన్, గోల్కొండ బ్రదర్స్ ,తదితర నేతలకు రామయ్య ధన్యవాదాలు తెలిపారు,.పార్టీ తనపై గల నమ్మకంతో తనకు కల్పించిన పదవికి వన్నె చేస్తూ పార్టీ అభివృద్ధికి నిజాయితీతో కృషి చేస్తూ, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని రామయ్య పెన్ పవర్ ప్రతినిధికి తెలిపారు.

# ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి -ఏపీవో సుబ్బారావు



**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 10**

మండలంలోని కోవిలంపాడు గ్రామంలో ఉన్న అనంతరాములు కుంట వద్ద జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను మంగళవారం ఏపీవో సుబ్బారావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల ప్రగతి, నాణ్యత, కూలీల హాజరు రిజిస్టర్ ను పరిశీలించి అక్కడ పనిచేస్తున్న కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పనులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. గ్రామాల్లో ఇంకా ఎక్కువ మందికి పనులు కల్పించేలా కూలీల సంఖ్యను పెంచాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కూలీలకు పనులు అందించడంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, కూలీలకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు పూర్తి చేస్తే వారికి పూర్తి స్థాయిలో దినసరి కూలీ లభిస్తుందని తెలిపారు. కూలీలు సమయానికి పనులకు హాజరై విధిగా పనులు పూర్తి చేయాలని సూచించారు.ప్రస్తుతం ఎండాకాలం తీవ్రంగా ఉండటంతో కూలీలు తమ ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఉదయం తొందరగా వచ్చి పనులు చేయాలని ఆయన సూచించారు. అవసరమైనప్పుడు విశ్రాంతి తీసుకోవడం, తగినంత తాగునీరు తీసుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు గ్రామాల అభివృద్ధికి కూడా తోడ్పాటు అందుతుందని అన్నారు గ్రామాల్లో చెరువులు కుంటలు శుభ్రపరిచే పనులు మట్టి పనులు చేపట్టడం ద్వారా పశు పోషకులకు కూడా ప్రయోజనం కలుగుతుందని అన్నారు తనిఖీ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ కిషోర్, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# అద్దంకి పురపాలక ప్రత్యేకాధికారిగా జాన్సన్

**అద్దంకి(ఆర్సి ఇంచార్జ్) పెన్ పవర్, మార్చి 10**

అద్దంకి పురపాలక సంఘం పాలకవర్గం పదవీకాలం ముగియడంతో పరిపాలనా వ్యవహారాల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం నూతన ప్రత్యేకాధికారిని నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా పాలకవర్గాల గడువు ముగిసిన పురపాలక సంఘాలు, నగర పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా అద్దంకి పురపాలక సంఘం ప్రత్యేకాధికారిగా స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి జాన్సన్‌కు బాధ్యతలు అప్పగించింది. నూతన పాలకవర్గం ఎన్నికయ్యే వరకు పురపాలక సంఘంలో పరిపాలనా వ్యవహారాలు, ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులను ప్రత్యేకాధికారి హోదాలో ఆయన పర్యవేక్షించనున్నారు.



# కుల బహిష్కరణకు దారి తీసే చర్యలకు పరిష్కారం

**ఎమ్మార్వో చిరంజీవి**



**మార్కాపురం టౌన్ పెన్ పవర్ మార్చి 10**

మార్కాపురం మండలం మిట్టమీది పల్లె లో నివసిస్తున్న ఎరుకల సామాజిక వర్గానికి చెందిన వారు వారి కులవృత్తి అయిన పందులు, ఇతరత్రా కార్యక్రమాలను చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారి జీవనవృత్తికి ఆటంకం కలిగిస్తూ గ్రామములో ఉన్న ఇతర ఆధిపత్య పెద్దలు తమ గ్రామంలోనికి గాని నిత్యవసరాల కొనుగోలుకు కానీ గ్రామంలోని వారు వారికి ఎవరు సహకరించకూడదని సహకరించినట్లయితే జరిమానా విధించబడుతుందని గ్రామంలోని గుడిలో ప్రకటన చేశారని, సోమవారం గ్రీవెన్స్ లో వచ్చిన ఫిర్యాదు మేరకు.. తాసిల్దార్ చిరంజీవి మరియు సిఐ సుబ్బారావు, గ్రామీణ ఎస్సై వేమనలు గ్రామానికి వెళ్లి ఇరు కుల పెద్దలతో మాట్లాడి, హెచ్చరికలు చేసి, సమస్యను పరిష్కరించడం జరిగిందని ఎమ్మార్వో తెలేపారు.

# కందుల శనగల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం





**పొన్నలూరు పెన్ పవర్ మార్చి 10**

మండలంలోని చెన్నుపాడు బోగనంపాడు గ్రామాలలో శనగ కందుల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయడం ద్వారా మండలంలోని గ్రామాల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని కొండపి ఏఎంసీ చైర్మన్ కర్ణ తిరుపతమ్మ తెలిపారు. మంగళవారం చెన్నుపాడు, భోగనంపాడు లో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఏవో వి రాము మాట్లాడుతూ కందులు క్వింటాకు 8 వేల రూపాయలు, సెనగలు క్వింటాకు రు 5875 చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండ్రగుంట శ్రీనివాసరావు, పొన్నలూరు పిఎసిఎస్ చైర్ పర్సన్ ఉన్నం కొండలరావు, ముప్పాళ్ళ పిఎసిఎస్ చైర్పర్సన్ మన్నెం రమణయ్య, సీనియర్ నాయకులు కర్ణ కోటిరెడ్డి, మండవ ప్రసాద్, పిల్లి వెంకట నారాయణరెడ్డి, పల్లపోతు రమేష్ బాబు, తానికొండ మహేంద్ర, అనుమోలు సుధాకర్, మన్నేం మల్లికార్జునరావు, చిడిపోతు శ్రీకాంత్, పిఎసిఎస్ మెంబర్స్ లింగంగుంట బ్రహ్మ పేరయ్య, భూమిరెడ్డి ఎరుకుల రెడ్డి, పల్లపోతు వెంకట్రావు, రమణయ్య, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# లింగ సమానత్వం పై అవగాహన కార్యక్రమం పురుషులకు వంటల పోటీలు







**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 10**

సమాజంలో మహిళా పురుష సమానత్వాన్ని పెంపొందించేందుకు లింగ సమానత్వం పై కనిగిరి పట్టణంలోని పాతురు అంగన్వాడీ కేంద్రం నందు మంగళవారం మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ సహకారంతో కనిగిరి మండల న్యాయ సేవాధికార సంస్థ,ఐ.సి.డి.ఎస్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఎన్.జి.ఒ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్మన్ న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి మహిళా పురుష సమానత్వం ఎంతో ముఖ్యమని తెలిపారు.మహిళల పట్ల గౌరవ భావం కలిగి ఉండడం,లింగ వివక్షను నివారించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.అలాగే మహిళల హక్కులు, మహిళలపై హింస మరియు వేధింపులను నిరోధించే చట్టాలు, బాల్య వివాహల నిర్మూలన బాలికల విద్య ప్రాముఖ్యత వంటి అంశాలపై పాల్గొన్న వారికి అవగాహన కల్పించారు.పారా లీగల్ వాలంటీర్ గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ కుటుంబం, విద్యా సంస్థలు,ఉద్యోగ ప్రదేశాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.మహిళలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారికి భద్రత మరియు గౌరవం కల్పించడం ద్వారా సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మహిళా పురుష సమానత్వాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో పురుషులకు వంటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలువురు పురుషులు ఉత్సాహంగా పాల్గొని తమ వంట నైపుణ్యాన్ని ప్రదర్శించారు. పోటీల్లో ప్రతిభ కనపరిచినవారిని అభిందించారు.ఈ కార్యక్రమం ద్వారా గృహ పనుల్లో కూడా మహిళలకు పురుషులు సమానంగా సహకరించాలని సందేశం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఐ సి డి ఎస్ సిబ్బంది అంగన్వాడీ టీచర్లు పి. రజిని, బి.మల్లేశ్వరి ఎం.వెంకటరత్నం, మహిళలు,పిల్లల తండ్రులు,యువత, స్థానిక ప్రజలు, గుడ్ హెల్ప్ ప్రతినిధులు,న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య అన్నదాన సత్రానికి ఎమ్మెల్యే ముత్తుములకు ఆహ్వానం



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 10**

రాచర్ల మండలం నెమలిగుండ్ల శ్రీ రంగనాయకస్వామి దేవస్థానం వద్ద నిర్వహిస్తున్న ఆర్యవైశ్య నిత్య అన్నదాన సత్ర కార్యక్రమానికి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ని నెమిలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థాన ఆర్యవైశ్య అన్నదాన సత్ర అధ్యక్షులు వక్కలగడ్డ మల్లిఖార్జున రావు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కలిసి అన్నదాన సత్రం నిర్వహణ, భక్తులకు అందిస్తున్న సేవల గురించి వివరించి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ఆశీర్వదించాలని కోరారు. భక్తులకు నిత్యంగా అన్నదానం నిర్వహించడం ఒక గొప్ప సేవ అని ఎమ్మెల్యే అభినందిస్తూ, ఈ సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

## బాలికల వసతి గృహాన్ని సందర్శించిన జిల్లా సివిల్ న్యాయమూర్తి



**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు మార్చి 10**

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల సూచనల ప్రకారం క్యాలెండర్ ఆక్టివిటీస్ లో భాగంగా మంగళవారం ఒంగోలు పట్టణంలోని సంతపేటలో గల సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే బాలికల వసతి గృహం నెంబర్ 2 ను జిల్లా న్యాయ సేవా కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ సందర్శించారు. అక్కడ బాలికలకు అందుతున్న వసతి, భోజన సదుపాయాల గురించి ఆరా తీశారు. వసతి గృహం యొక్క దస్త్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహం యొక్క సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ సిహెచ్ సరితా దేవి పాల్గొన్నారు.

## టెట్ నుండి మినహాయింపు కోరుతూ ఏపీటీఎఫ్ ధర్నా






**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 10**

టెట్ నోటిఫికేషన్ విడుదలకు ముందు ఎంపికైన ఉపాధ్యాయులను టెట్ పరీక్ష నుండి మినహాయించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో మండలం నుండి ఏపీటీఎఫ్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్ మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం ప్రకారం సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు కూడా టెట్ పరీక్షలు ఉత్తీర్ణులు కావాలని, లేనిపక్షంలో ఉద్యోగం నుండి తొలగించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన పరిస్థితి ఉందన్నారు.ఈ తీర్పుకు కారణమైన విద్యా హక్కు చట్టాన్ని సవరించాలని, టెట్ నోటిఫికేషన్ రాకముందే ఎంపికైన ఉపాధ్యాయులను టెట్ నుండి పూర్తిగా మినహాయించాలని డిమాండ్ చేస్తూ ఈ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్తో పాటు మండల శాఖ అధ్యక్షులు తోట శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి జె.ఎస్. ఆనంద్ బాబు, జిల్లా కార్యదర్శి జి. రామకృష్ణ, మండల నాయకులు డి. సుబ్బరాయుడు, జి. వెంకటేశ్వర్లు, ఇండ్ల ప్రసాద్, ఆర్ సుబ్బయ్య, దండే శ్రీనివాసులు, నన్నసాని గాంధీ, యస్ వహీదా, టి రమేష్, బి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కొరిశపాడులో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన రాష్ట్ర మంత్రి



**అద్దంకి(ఆర్సి ఇంచార్జ్) పెన్ పవర్, మార్చి 10**

అద్దంకి నియోజకవర్గంలో విషాదంలో ఉన్న పలు తెలుగుదేశం పార్టీ కుటుంబాలను రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి. రవికుమార్ మంగళవారం పరామర్శించారు. ఇందులో భాగంగా ఆయన కొరిశపాడు మండలంలో పర్యటించారు. ?కొరిశపాడు గ్రామానికి చెందిన తేళ్ళ. ఆనందరావు ఇటీవల హఠాన్మరణం చెందారు. విషయం తెలుసుకున్న మంత్రి గొట్టిపాటి నేరుగా ఆనందరావు నివాసానికి వెళ్లారు. అక్కడ ఆనందరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షా కేంద్రాల పరిశీలించిన చీఫ్ అధికారులు.



**పొన్నలూరు పెన్ పవర్ మార్చి 10**

పదవ తరగతి పరీక్షలకు సంబంధించి పరీక్షా కేంద్రలని చీఫ్ కె అనూరాధ అరికట్ల శ్రీనివాసులు మంగళవారం నాడు పరిశీలించారు.పొన్నలూరు మండలంలోని పొన్నలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇప్పగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను రెండు పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేయడం జరిగిందని ఈ విద్యా సంవత్సరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పొన్నలూరు సెంటర్ నందు మండలంలోని పొన్నలూరు, చెన్నిపాడు, ముండ్లమూరి వారి పాలెం, చెరువుకొమ్ముపాలెం ముప్పాళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పొన్నలూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల మండలంలోని రెండు ప్రైవేటు పాఠశాలలకు చెందిన 246 మంది విద్యార్థులు ఇప్పగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సెంటర్ నందు ఇప్పగుంట కేజీబీవీ బాలికల విద్యాసంస్థల నుండి 94 మంది విద్యార్థులు మొత్తం 340 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారని తెలియజేశారు.ఈరోజు ఈ సెంటర్లకు సంబంధించి చీఫ్ డిపార్ట్మెంట్ ఆఫీసర్లు మండల విద్యాశాఖ అధికారులు పరీక్షా కేంద్రాలను పరిశీలించడం జరిగింది. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన బల్లలు, మంచినీటివసతులు టాయిలెట్లు తరగతి గదులను పరిశీలించి తగిన వసతి ఏర్పాట్లను చేయడం జరిగిందని పొన్నలూరు మండల విద్యాశాఖ అధికారి రవిచంద్రబాబు సుబ్బరామయ్యలు తెలియజేశారు. పరీక్షా కేంద్రాల తనిఖీలో రెండు సెంటర్ల చీఫ్ సూపర్డెంట్లు ఎల్ అనురాధ ఆరికట్ల శ్రీనివాసులు డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు వై వెంకటేశ్వరరావు శ్యాం సుధాకర్ లు పాల్గొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ పోలీస్ బందోబస్తు, వైద్య సౌకర్యాలు ఏర్పాటు కొరకు రిక్వెస్ట్ లెటర్లు ఇవ్వడం జరిగిందని తెలియజేశారు.

## హెచ్ పి వి వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని ప్రారంభించిన ఇంటూరి

**కందుకూరు పెన్ పవర్, మార్చి 10:**

గర్భాశయ క్యాన్సర్ ను నివారించడంలో భాగంగా క్యాన్సర్ కు కారణమయ్యే హెచ్ పి వి వైరస్ వ్యాక్సిన్ ను బాలికలకు వేసే కార్యక్రమాన్ని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. కందుకూరు పట్టణంలోని కోవూరు రోడ్డులోగల, జనార్ధన కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యాక్సిన్ వేయించుకున్న బాలికలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత జీవన విధానం, ఆహారపు అలవాట్లు కారణంగా క్యాన్సర్ బారిన పడే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోందన్నారు. చిన్నపిల్లలకు కూడా మహమ్మారి సోకుతోందని, ప్రపంచవ్యాప్తంగా దీనిపై ఆందోళన పెరుగుతోందన్నారు. ప్రధానమంత్రి మోడీ క్యాన్సర్ నిర్మూలన కోసం అనేక చర్యలు చేపట్టారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో 15 సంవత్సరముల లోపు బాలికలకు ఈ వ్యాక్సిన్ ను ఉచితంగా వేస్తున్నారని, ప్రతి ఒక్కరూ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే నాగేశ్వరావు కోరారు. మున్సిపల్ కమిషనర్ అనూష మాట్లాడుతూ ఈ వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా, భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. వ్యాక్సిన్ విషయంలో ఎలాంటి అపోహలకు లోను కావద్దని సూచించారు. ఆరోగ్య కేంద్రం వైద్యురాలు స్టెల్లా కారుణ్య మాట్లాడుతూ ప్రస్తుతం మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ కేసులు ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు. వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా 70 శాతం




కేసులను అరికట్టవచ్చని తెలిపారు. ముందుగా ఆరోగ్య కేంద్రానికి విచ్చేసిన ఎమ్మెల్యే నాగేశ్వరావు కి స్థానిక వైద్య సిబ్బంది, వార్డు నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు స్టెల్లా కారుణ్య, బ్యూలా గ్రేస్, పద్మావతి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, పార్టీ నాయకులు పువ్వాడి కోటయ్య, గడ్డం మాలకొండయ్య, కూనం నరేంద్ర, తూమాటి బ్రహ్మయ్య, గుర్రం మధు, ముచ్చు వేణు, పొడపాటి మాధవ, పువ్వాడి మురళి, యర్రా ముసలయ్య, ముప్పవరపు వేణు, భవనాసి వెంకటేశ్వర్లు, గుమ్మా శివ, మురారిశెట్టి సుధీర్, షేక్ కాలేషా ధనేకుల ప్రసాదు, ముచ్చు శ్రీను, రామకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పు చెరువు ప్రాంతంలో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించిన పోలీసులు



**కందుకూరు పెన్ పవర్,మార్చి 10:**

జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఉత్తర్వులు మేరకు కందుకూరు




పట్టణంలోని ఉప్పుచెరువు ఏరియాలో కందుకూరు సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ సిహెచ్ వి బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉప్పు చెరువు ఏరియాలోని ఇళ్ళను తనిఖీ చేసి సరైన పత్రాలు లేని వాహనాలు స్వాధీనపరచుకున్నారు అలాగే యువత అందరికీ డ్రగ్స్ గురించి దాని యొక్క దుష్ప్రభావాల గురించి అవగాహన కల్పించారు. అలాగే డ్రగ్స్ వాడబోమని యువత చే ప్రతిజ్ఞ చేయించి తదనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కందుకూరు సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ సి.హెచ్.వి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ డ్రగ్స్ వాడకూడదని దానివలన జీవితాలు నాశనం అవుతాయని ఎవరైనా డ్రగ్స్ వాడినా రవాణా చేసిన అమ్మిన అటువంటి వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని అటువంటి వారి గురించి తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని వారి యొక్క వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో కందుకూరు సిఐ షేక్ అన్వర్ భాషా, గుడ్లూరు సిఐ డి.నరేష్ కుమార్, కందుకూర్ పట్టణ,ఉలవపాడు, గుడ్లూరు, వలేటివారిపాలెం ,లింగసముద్రం పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

## అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆర్డిఓ ప్రభాకర్

**త్రిపురాంతకం పెన్ పవర్ మార్చి 10**

త్రిపురాంతకం మండలం లో ప్రభుత్వము యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే చేయమని అధికారులకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ నత్త నడకలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు ఉద్యోగ సిబ్బందిపై మార్కాపురం ఆర్డిఓ పెంచల ప్రభాకర్ ఆకస్మిక తనిఖీ చేసి నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే మండలంలోని వైద్య ఆరోగ్యశాఖ వైద్యశాలను తనిఖీ చేసి అక్కడున్న వైద్యాధికారుల పని తీరుపై కూడా సంబంధిత అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యశాలలో రోగులకు అందాల్సిన వైద్య సేవ సక్రమంగా లేదని అక్కడున్న స్థితిని చూసి ఆయన ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలని ఆర్డిఓ పెంచల ప్రభాకర్ ఆదేశించారు అదేవిధంగా మండల పరిషత్తు అభివృద్ధి అధికారి మండలంలోని ఉద్యోగ సిబ్బందిపై ఎంపీడీవో సర్వే రిపోర్టును సక్రమంగా ఆర్డిఓకు అందించలేకపోవడం



అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకపోవడం వల్ల పనితీరును మార్చుకొని సక్రమంగా పనిచేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు ఇప్పటికైనా సర్వే పూర్తి చేసి అందుకు సంబంధించిన పూర్తి నివేదికను తమ పంపాలని ఆర్డిఓ ప్రభాకర్ మండలంలోని అధికారులకు గట్టిగా హెచ్చరిక చేశారు.

## మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం





**పొన్నలూరు పెన్ పవర్ మార్చి 10**

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సుజాత పంచాయతి డెవలప్మెంట్ అధికారులకు పశు సంవర్ధక అధికారులకు ఉపాధి సిబ్బందికి మంగళవారం సాయంత్రం 3 గంటలకు సమీక్ష సమావేశం ఏర్పాటు చేయటం జరిగింది.ఈ కార్యక్రమంలో కాటిల్ ట్రబ్స్ గురించి వేసవి కాలం వచ్చినందున వడ గాలులు కారణంగా ప్రతి పశు వుల తొట్టిని నీటితో నింపాలని పశు సంవర్ధక శాఖ ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందికి ఆదేశించడం జరిగినది. ఏన్ ఏం ఏం ఎస్ మీద ఉన్న సమస్యలు లను ఫీల్డ్ అసిస్టెంట్ తో మాట్లాడి పరిష్కార మార్గాలను, సూచనలు ఇవ్వడం జరిగింది. అన్ని గ్రామ పంచాయతీలలో పని చేయించాలల్సిన పని జరగని వాటిపై పై అధికారులకు తెలియ పరచడం జరుగినది. అన్ని గ్రామ పంచాయతీలలో యుక్త దార యాప్లో ఎస్టిమేషన్ వేయటం తేదీ 20/03/2026 లోపు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ రామకృష్ణ కోటేశ్వరరావు సుధాకర్ కోటేశ్వరరావు అనీల్, రవి, కొండయ్య, కుమార్, పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

## అటవీ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు



**పొన్నలూరు పెన్ పవర్ మార్చి 10**

అటవీ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశీ అన్నారు. మండలంలోని తిమ్మపాలెం గ్రామంలో సర్వే నంబర్ 787లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ అటవీ భూములను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని ఆక్రమించి కొందరు మరొక వ్యక్తులకు విక్రయిస్తున్నట్లు గ్రామస్తుల ఫిర్యాదు మేరకు భూములను పరిశీలించామన్నారు. సర్వే నంబర్లు 787, 1439, 1440 లోని ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేయవద్దని కందుకూర్ సబ్ రిజిస్టర్ కు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. రెవిన్యూ రికార్డుల ట్యాంపరింగ్ పై కూడా విచారణ చేపట్టి అట్టి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కావలి సబ్ డివిజన్ అటవీ శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి సెక్షన్ ఆఫీసర్ సురేష్ పాల్గొన్నారు.

## కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



**కందుకూరు పెన్ పవర్, మార్చి 10**

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం లో ప్రవేశాలకు ఈ నెల 12 వ తేదీ నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ స్వాతి తెలిపారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 6 వ తరగతి కి 40 సీట్లు , 7 వ తరగతి కి 7 సీట్లు, 9 వ తరగతి కి 5 సీట్లు , 10 వ తరగతి లో 1 సీటు , ఇంటర్మీడియట్ ఎంపీసీ గ్రూప్ కి ప్రథమ సంవత్సరం 40 సీట్లు , ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం లో 17 సీట్లు ఖాళీ లు వున్నాయి అని తెలియజేశారు . ఏదయినా సమాచారం కొరకు 9666092091 అనే నంబర్ కి ఫోన్ చేయగలరు అని తెలిపారు.

# ఆక్రమణలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం

**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ మార్చి 10**

యస్సి భూములను ఆక్రమించుకున్న వారిపై విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్సి కమిషన్ సభ్యులు డాక్టర్ పాకనాటి గౌతమ్ రాజ్,డాక్టర్ శ్రీ పతి బాబులు అన్నారు.మంగళవారం వారు మండలంలో విస్తృతంగా పర్యటించారు.పట్టణంలోని రాళ్ళవాగు పక్కన సర్వే నెంబర్ 28లో తన పొలాన్ని అక్రమించారని అంబేద్కర్ నగర్ కు చెందిన సాలమ్మ ఎస్సి కమిషన్ కు ఫిర్యాదు చేసింది.అలాగే మార్కాపురం రోడ్డు పక్కన సర్వే నెంబర్ 144/4 లో తన పొలాన్ని అక్రమించారని కోటయ్య అనే వ్యక్తి ఎస్సి కమిషన్ కు పిర్యాదు చేసారు.ఈ మేరకు ఎస్సి కమిషన్ సభ్యులు గౌతమ్ రాజ్,శ్రీ పతి బాబు ఆ సర్వే నెంబర్లలో విచారణ చేపట్టారు.తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించి బాధితులతో మాట్లాడారు.ఆ సర్వే నెంబర్లలో కొలతలు వేసి సరైన రిపోర్టు ఇవ్వాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు.ఈ విషయాన్ని ఎస్సి కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకొని వెళ్లి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.ముందుగా పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ భోజనం పరిశీలించారు.స్వయంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.






ఉపాద్యాయులతో మాట్లాడారు.ఉపాద్యాయుల కొరత,వసతుల గురించి పాఠశాల చైర్మన్ ఎస్సి కమిషన్ సభ్యులకు తెలిపారు.ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే మండలంలోని అమను గుడిపాడు గ్రామంలో ఎస్సి స్మశానవాటిక స్థలాన్ని అగ్రకులస్తులు అక్రమించి,అడ్డుతగులుతున్నారని గ్రామ ఎస్సిలు కమిషన్ కు ఫిర్యాదు చేశారు.దీనిపై కూడా ఎస్సి కమిషన్ సభ్యులు అక్కడికి వెళ్లి విచారణ చేశారు.పూర్తి స్థాయిలో విచారణ జరిపి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకొని,బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు.వారి వెంట ఆర్డీవో కిషోర్,సాంఘిక సంక్షేమ శాఖ డిడి లక్ష్మ నాయక్,తహసీల్దార్ మంజునాథ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# అల్లాహ్ అందరినీ చల్లగా చూడాలి

**- రూబీ ఇంట ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఇంటూరి**

**-ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ దువా చేసిన ఎమ్మెల్యే**





**కందుకూరు పెన్ పవర్,మార్చి 10**

పట్టణంలోని 7వ వార్డు విక్కిరాలపేట రోడ్డులో నెల్లూరు పార్లమెంట్ టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ రూబీ ఇంట్లో మంగళవారం జరిగిన ఇఫ్తార్ విందులో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూబీ కుటుంబ సభ్యులతో పాటు ముస్లిం సోదరులు ఎమ్మెల్యే కి ఆత్మీయ స్వాగతం పలికారు. ముస్లిం సోదర సోదరీమణులను, చిన్నారులను ఎమ్మెల్యే చిరునవ్వుతో పలకరించారు. అహ్మద్ వలి ఆధ్వర్యంలో దువా చేశారు. పవిత్ర రంజాన్ ఉపవాస సమయంలో అల్లాహ్ అందరినీ చల్లగా చూడాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఆకాంక్షించారు. అందరికీ ముందస్తుగా రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. చివరగా రూబీ బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు గౌస్ బాషా, రఫీ, నాయబ్ రసూల్, జియావుద్దీన్, ఆరిఫ్, చంటి యూనస్, కుద్దూస్ నామతుల్లాషా, అన్వర్ బాషా జహీర్, మాబాషా, సుభాని తదితరులు పాల్గొన్నారు.

# ఓఎంసీలో ఏసీబీ సోదాలు



**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి10**

ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయంలోని పట్టణ ప్రణాళిక విభాగం నందు మంగళవారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు.టౌన్ ప్లానింగ్ విభాగం పై ఫిర్యాదులు రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఏకకాలంలో సోదాలు చేపట్టారు. అందులో భాగంగా గుంటూరు, శ్రీకాకుళం, ఒంగోలు, విశాఖపట్నం, తిరుపతి జిల్లాల్లో ఏసీబీ అధికారులు ఈ సోదాలు చేశారు. ఒంగోలులో జరిగిన సోదాల్లో భాగంగా పట్టణ ప్రణాళిక సిబ్బంది ని ఏసీబీ అధికారులు విచారిస్తున్నారు.పలు రికార్డులను పరిశీలించారు. వారి వద్ద వున్న సొమ్ము గురించి వివరాలను సేకరించారు.రాత్రి గం 7.30ల వరకు ఈ సోదాలు కొనసాగాయి. ఏసీబీ సోదాలతో నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది ఉలిక్కిపడ్డారు. పట్టణ ప్రణాళిక విభాగంలో ఏసీబీ సోదాలు జరుగుతున్నాయన్న సమాచారంతో రెవెన్యూ విభాగం సిబ్బంది కార్యాలయం నుంచి పలయానం చిత్తగించడం చర్చానియాంసమైంది.

## రీసెర్వే పనులు వేగవంతం చేయాలి: అద్దంకి ఆర్డివో

**మేదరమెట్ల, పెన్ పవర్ మార్చి 10**

మండలంలో నిర్వహిస్తున్న రీసెర్వే పనులు వేగవంతం చేయాలని అద్దంకి ఆర్డివో జాన్సన్ అన్నారు. కొరిసపాడులోని తహసీల్దార్ కార్యాలయంలోని దస్త్రాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. రీసర్వేలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకూడదని తెలిపారు. ఎర్రం చిన్న పోలిరెడ్డి ఎత్తిపోతల పథకం పునరావాస గ్రామానికి సంబంధించిన రైతులతో మాట్లాడాలని తహసీల్దార్‌కు సూచించారు. రెవెన్యూ సంబంధిత సమస్యలు ఉంటే నేరుగా తనను సంప్రదించాలని ప్రజలను కోరారు.

# కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

**పీసీపల్లి, పెన్ పవర్ మార్చి 10**




రైతులు పండించిన పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోని మద్దతు ధర పొందాలని కనిగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీ షేక్. జైన్లాబ్ధిన్ తెలిపారు. మంగళవారం స్థానిక పీసీ పల్లి మండలంలో మండలం తెదేపా పార్టీ అధ్యక్షులు వేమూరి రామయ్య మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందులు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారుల చేతుల్లో మోసపోవద్దని సూచించారు. కందుల కనీస. మద్దతు ధర క్వింటాకు రూ.800 రూపాయలు ఉందన్నారు. రైతులందరూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకుని లబ్ధి పొందాలని అన్నారు. . రైతు సేవా కేంద్రాలలో గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా సిఎం యాప్ నందు నమోదు చేసుకోవడం వలన మద్దతు ధరకు విక్రయించుకొనే వీలు ఉంటుందని తెలిపారు. రైతులు ముందుగా తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో బయోమెట్రిక్ వేసి నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు ప్రక్రియ పూర్తి చేసిన రైతుల నుండి మాత్రమే కందులు స్వీకరించబడతాయని తెలియజేశారు. రైతుల నుండి కందులు ఉత్పత్తులను కొనుగోలు చేయబడిన వెంటనే , రైతు యొక్క ఆధార్ కు లింక్ అయినా బ్యాంకు ఖాతాలో నేరుగా చెల్లింపులు చేయబడతాయని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం సొసైటీల ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ బ్యాంక్ డైరెక్టర్ ఉండేల పిచ్చి రెడ్డి , ఏవో రంగ కృష్ణ , సొసైటీ సీఈవో భాషా, మండల క్లస్టర్లు కన్వీనర్ పులి ప్రతాప్ రెడ్డి , ఏనుగంటి నాగేంద్రబాబు, పార్టీ నాయకులు, శర్మ,సత్తిరెడ్డి , వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అండగా కూటమి ప్రభుత్వం - ఎమ్మెల్యే దామచర్ల

**కలెక్టరేట్ ఒంగోలు ,పెన్ పవర్ మార్చి10**

కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు అన్నారు. ది పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య లిమిటెడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.ఒంగోలు నియోజకవర్గ పరిధిలో 7974 ఎకరాల్లో శనగ పంటను సాగు చేసినట్లు తెలిపారు. క్వింటాలుకు 5870 మద్దతు ధరను ప్రభుత్వం కల్పించిందని అన్నారు.గతం కంటే ఎక్కువగా శనగ రైతులకు ప్రభుత్వం





మద్దతు ధర కల్పించిందని స్పష్టం చేశారు.దళారి వ్యవస్థను నమ్మి రైతులు మోసపోవద్దు అని అన్నారు. ఒంగోలు, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల్లో శనగల కొనుగోలు కేంద్రాలను రైతులకు అందుబాటులో ఉంచడం జరిగిందని పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య చైర్మన్ మండవ జయంతి బాబు తెలియజేశారు. అమ్మకాలు చేసిన రైతులకు 24 గంటల లోపే ప్రభుత్వం సొమ్ము జమచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాసరావు, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు,ఉడా చైర్మన్ షేక్ రియాజ్,ఏఎంసీ డైరెక్టర్ వీరభద్రరావు, మేనేజింగ్ డైరెక్టర్ నర్రా సురేంద్ర బాబు,రైతులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com